# అన్నమాచార్య
# 577 వ జయంత్యుత్సవ సంచిక



అన్నమాచార్య భావనా వాహిని
హైదరాబాదు

శ్రీ చరణ చిత్రాలయ సహకారంతో

ఆదివారం మే 5, 1985



తాళ్లపాక అన్నమాచార్య
( 1408 – 1503 )

రాజీవనయను వరప్రసాదమున తేజంబు మఱియు
నెంతే విస్తరిల్ల లక్కమాంబను పుణ్యలావణ్యనిధికి
చక్కని గ్రహము లుచ్చమున మూడలర అనుపమ
లగ్నంబునందు వైశాఖమున విశాఖను ఘగంటున
నుల్లసిల్ల జనియించె అన్నమాచార్యుండు.

# Annamacharya Bhavana Vahini


**Founder - President**

**Smt. SHOBHA RAJU**

**ADVISORY BOARD**

**Chairman**

Sri K. V. K. RAJU
M. D. Nagarjuna Steels

**Members**

Sri P. V. R. K. PRASAD, I.A.S.,

Sri T. SUBBARAMI REDDY
Member, Central Censor Board

Sri B. V. RAMA RAO, I A.S.,
Sec. A.P S E B.

Sri P. L. SANJEEVA REDDY, I.A.S.,
MD. A.P.I.D.C.

Sri R. PRABHAKAR RAO, I.P S.,
Commissioner ot Police

Sri JANDHYALA
Film Director

Sri C. RAMA KRISHNA
C. P. R. O., S. C. Railway

Sri P. VENKATESWARA RAO
Editor, Andhra Prabha

Smt. D. SEETA PADMA RAJU
Film Producer

Sri MURALI KRISHNA
Director, Telecommunications

Sri T. S. S. N. RAJU
Jt., Commissioner
Endowments Dept. Govt. of A. P.

Sri KUMARA SWAMY
Raveena Sports, Sec'bad.

Sri V. BHOOPAL REDDY
Sangeetha Theatre

Sri A. S. MURTHY
Former Director, Ravindra Bharathi

Sri P. S. RAJAGOPALA RAJU, I.A.S.,
Retd. Commissioner for Transport

Sri KOKA SATYANARAYANA
Retd. Joint Collector.

Dr. B. RAJANIKANTA RAO

Dr. B. RAMARAJU

Dr. VETURI ANANDA MURTY

# Annamacharya Bhavana Vahini


## EDITORIAL BOARD

Smt. SHOBHA RAJU, Chief Editor

Sri A. S. MURTHY, Working Editor

Sri CHALLA RAMA PHANI, Asst. Editor

Honorary Advisers :

Sri P. S. R. ANJANEYA SASTRY

Sri V. V. SASTRY

Sri N. S. PARABRAHMA MURTHY

# భావనా నివేదన

"పాడేము మేము పరమాత్మ నిన్ను
వేడుక ముప్పది రెండు వేళల రాగాలను"

అన్నమయ్య మానస బృందావనిలో ముప్పై రెండువేల అపూర్వ సంకీర్తనా కుసుమాలు విరబూశాయి. దైవవశాత్తు ఆ బృందావనిలో అడుగిడిన నాకు దూరంగా అందాలు చిందే సుమబాలలు కనిపించాయి. దగ్గరకు వెళ్లినకొద్దీ దివ్య పరిమళాలు చిందిస్తూ నాకో అలౌకికానందానుభూతిని కలిగించాయి. వాటితో నాకు విడదీయరాని బంధం ఏర్పడింది. ఆ బంధంలో ప్రాపంచికంగా నే ననుభవించినది ప్రయాసే అయినా, పారమార్థికంగా, కళాత్మకంగా నే పొందిన హాయిని మాటలలో చెప్పలేను. అది అనుభవైక వేద్యం. అందుకే ఎన్నటికీ వాడని ఆ పుష్ప గుచ్ఛాలను ఊరూరా, వాడవాడలా తీసుకొని వెళ్లి ఆ మధుర గంధాలను అందరికీ అందించాలన్న కోరికతో ఆ సంకీర్తనాచార్యుని భావనావాటికలో ఓపక్షినై ఆ కొమ్మనా ఈ కొమ్మనా కూని రాగాలు తీస్తూ ఎవరైనా విని పొందే ఆనందమే ఆహారంగా జీవిస్తున్నాను.

ఉడుత రామునికి చేసిన సేవ మన దృష్టిలో స్వల్పం. ఉడుత ప్రాణానికది మోయలేక మోసిన భారం!

సంకీర్తనా ప్రచార యజ్ఞంలో నా పాత్ర అలాగే తిరుమల ప్రభుపు కొలువులో ప్రారంభమైంది. ఈ నా జీవితం ఆ మహాయజ్ఞానికి తొలి కళాకారిణి రూపంలో తొలి సమిధగా మిగిలిపోతుందన్న భావం నాకు మహా సంతృప్తిని కలిగిస్తుంది. ప్రాపంచిక పరిగణన మాటలెలా ఉన్నా యజ్ఞకర్త, యజ్ఞభోక్త అయిన తిరుమల సార్వభౌముని అనంత మానసాంబరంలో ఓ మూల ఈ దీనురాలిపై చిన్న కరుణాకిరణం మెరుస్తూ ఉంటుందన్న నమ్మకం!

అధికారుల సహకారంతో ఓ అన్నమాచార్య ప్రాజెక్టును నెలకొల్పాం తిరుపతిలో. ప్రజాభిమానం దోహదంగా మూడుపువ్వులారుకాయలైంది మా ప్రయత్నం. పరిమిత పరిధిలో కాక, విస్తృతంగా అన్నమయ్య భావనా వాహినిని, వేంకటేశ్వరుని కీర్తి సౌరభాన్ని విశ్వవ్యాప్తం చేయాలన్నదే ఆ ఏడుకొండలవాని ఆదేశమేమో!

కష్టమైనా సుఖమైనా ఏది ఏమైనా అన్నమయ్య తత్త్వప్రచార యజ్ఞానికంతరాయం కలిగించకూడదనుకున్నాను. ఈ భావనతో నే చేసిన ఎన్నో ప్రయత్నాలకు ఓ రూపం

"అన్నమాచార్య భావనా వాహిని". వేంకటేశ్వరుని పదముల నీడ, అన్నమయ్య కృతి గూర్చిన దండెలే ఈ సంస్థకు అండదండలు.

ఈ సంస్థ ద్వారా లెక్కకు మిక్కుటంగా కార్యక్రమాలు సమర్పిస్తూ వస్తున్నాము. శ్రద్ధాళువులైనవారికి అన్నమాచార్య కీర్తనల బోధనా తరగతులు నిర్వహిస్తున్నాము. "అన్నమయ్య కృష్ణగానం" అన్న క్యాసెట్‌ను విడుదల చేయడం జరిగింది. అన్నమయ్య వర్ధంతి, జయంత్యుత్సవాలను జరుపుకుంటున్నాం. 577వ జయంత్యుత్సవ సందర్భంగా ఈ సంచికను రూపొందించాం. గత వర్ధంతి ఉత్సవంలో ప్రముఖ చలనచిత్ర దర్శకులు శ్రీ జంధ్యాలగారికి శ్రీ చరణ చిత్రాలయ వారు తలపెట్టిన "హరికీర్తనాచార్య అన్నమయ్య" అన్న చిత్రానికి నేను వ్రాసిన స్క్రిప్టు అందించడం జరిగింది. చేసింది కొంత- చేయవలసింది ఎంతో!

ఎంత గొప్ప ప్రణాళికలున్నా, ఎంతటి మహాసామర్థ్యమున్నా వెలిగే దీపానికి చమురులా కార్యక్రమ నిర్వహణలో కొన్ని వనరులు అవసరమౌతాయి. ఆ వనరులు మాకు సమకూర్చిన నాగార్జున స్టీల్స్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ కె. వి. కె. రాజుగారికి, శ్రీ చరణ చిత్రాలయ నిర్మాతలు శ్రీమతి సీతాపద్మరాజు గారికి, శ్రీమతి అన్నపూర్ణ జంధ్యాల గారికి, మా భావనా వాహిని తరపున కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

మాకు వార్షిక గ్రాంటుగా ఇరవై ఆయిదు వేల రూపాయలను ప్రకటించిన ప్రభుత్వానికి, రసహృదయులు, సోదరులు శ్రీ పి. వి. ఆర్. కె. ప్రసాద్‌గారికి, అందుకు కారణభూతులైన శ్రీమతి ప్రతిభా భారతిగారికి మా హార్దాభివందనలు.

ఒక పుష్పం ఓ తోటలో విరబూసి రాలిపోవచ్చు. ఒక సుందరి జడనలంకరించి వాడిపోవచ్చు. ఒక గృహంలో అలంకార ప్రాయంగా ఉండవచ్చు. ఓ గుడిలో స్వామి పాదాల సర్పింపనూవచ్చు. నాలో ఉన్న కొద్దిపాటి కళలను గుర్తించి, అన్నమాచార్య సంకీర్తనలో ప్రత్యేక శిక్షణ పొందేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం వారి తొలి స్కాలర్‌షిప్ నాకిచ్చి, ఆ సంకీర్తనా సౌరభాన్ని దేశం నలుదిశలా వ్యాపింపజేయడానికి ప్రత్యేకించి నను తొలి కళాకారిణిగా నియమించిన పితృతుల్యులు, నాటి తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వహణాధికారి శ్రీ పి. యస్. రాజ గోపాలరాజు గారికి సర్వదా కృతజ్ఞురాలిని.

ఈ జయంత్యుత్సవ నిర్వహణలో మాకు తోడ్పడుతున్న సలహాదారుల సంఘానికి రవీనా స్పోర్ట్స్ ప్రొప్రైటర్ అయిన సోదరులు శ్రీ కుమారస్వామిగారికి, రాష్ట్ర విద్యుత్ సంస్థ కార్యదర్శి శ్రీ బి. వి. రామారావుగారికి, మా భావనావాహిని విద్యార్థి రామఫణికి, శ్రీ వేమరాజు విజయకుమార్‌గారికి, సకాలానికి మా ఈ సంచికను అందంగా తీర్చిదిద్ది అందచేసిన రమేష్ ప్రింటర్స్ వారికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు.

అన్నమాచార్య భావనా వాహిని కార్యనిర్వహణలో నాకు తోడ్పడుతున్న సోదరులు శ్రీ ఎ. యస్. మూర్తి గారికి నా అనురాగాభినందనలు.

ఈ సంకీర్తనలు పాడి ప్రచారానికి దోహదం చేస్తున్న కళాకారులందరికీ పేరు పేరునా నా అభినందనలు! నాకు ప్రోత్సాహమిచ్చి నా కార్యక్రమాలకు శక్తి నిస్తున్న నా ప్రియతమ శ్రోతలకు నా ప్రియాభివందనములు! నా యీ కైంకర్యాన్ని అవగాహన చేసుకొని అభిరుచులకు అనుగుణంగా వర్తిస్తున్న మా శ్రీవాస డా॥ నందకుమార్ గారికి నా ప్రణయాంజలి! వేంకటేశ్వరుని మించిన ధనవంతుడెవరు? వేంకటేశ్వరుని మించిన ఖ్యాతి ఎవరికుంది? వేంకటేశ్వరుని కున్న సేవకులెవరికున్నారు? అర్థబలంతో, అంగబలంతో, నామబలంతో వేంకటపతి ప్రియభక్తుడైన అన్నమయ్యకు తిరుపతిలో ఘనంగా ఉత్సవాలు జరిపిస్తే ఆశ్చర్యపోనక్కర లేదు! కానీ ఏ బలం లేని మాచేత ఈ ఉత్సవాలు ఇంత వైభవంగా జరిపించడం నాకెంతో ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. "ఎందెందు వెదకి చూచిన అందందే గలడు!"

ఎండగాని నీడగానీ ఏమైనాగానీ
"కొండల రాయడే మా కులదైవము"

అన్నమాచార్య భావనా వాహిని నిరంతరాయంగా పవిత్ర గంగానదిలా సాగిపోవాలని ఆశీర్వదిస్తారని ఆశిస్తూ

హరిసంకీర్తనలో సదా మీ

శోభారాజు

# పద కవితా పితామహానకు
# కవితా కుసుమాంజలి

— చల్లా రామ ఫణి

పద కవితా కల్పనలకు
గురుడవట అన్నమయ్యా
నీ పదములు మేము పాడి
తరియించే మన్నమయ్యా ॥పద॥


నందకాంశుడవు నీవు
నారాయణ సఖుడవు
నీ పదము పదమునా
పథమును వెతికే పాంధులము మేము ।పద॥

నీ పదముల కాధారము
బ్రహ్మ కడిగిన పాదము
నీ పదములె మాకు
జీవనాధారము, జీవితాదర్శము ।పద॥


క్షేత్రయ, త్యాగయ్యలకు స్ఫూర్తి నీ పదములు
వేదాలై శోభించే నాదాలే నీ పదములు
తెలుగు చందమామ చిందు
పొగరు వెన్నెలలే నీ పదములు ।పద॥



పెద తిరుమలాచార్య




పెద్ద తిరుమలాచార్య చెక్కించి, సంకీర్తనా భాండాగారంలో భద్రపరచిన అన్నమయ్య కీర్తనల రాగిరేకుసమూనా.



అన్నమాచార్య భావనావాహిని ఆధ్వర్యంలో అన్నమాచార్య సంకీర్తనల బోధనా తరగతుల ప్రారంభోత్సవ సభలో ప్రసంగిస్తున్న శ్రీమతి శోభారాజు.



అన్నమాచార్య వర్ధంతి సందర్భంగా పూజ.



అన్నమాచార్య 482వ వర్ధంతి ఉత్సవంలో ఆరాధనా కీర్తనలను ఆలపిస్తున్న
అన్నమాచార్య భావనావాహిని విద్యార్థులు.



అన్నమాచార్య వర్ధంతి ఉత్సవంలో 'హరికీర్తనాచార్య అన్నమయ్య' చిత్రానికి శ్రీమతి శోభారాజు వ్రాసిన స్క్రిప్టును శ్రీ ఐంధ్యాల కందిస్తున్న శ్రీ పి. వి. ఆర్. కె. ప్రసాద్.



'అన్నమాచార్య భావనావాహిని' నిర్వహించిన అన్నమయ్య 482వ వర్ధంతి ఉత్సవసభలో ప్రసంగిస్తున్న శ్రీ సి. రామకృష్ణ, C.P.R.O, దక్షిణ మధ్యరైల్వే.



ప్రాతికేయులగోష్ఠిలో శ్రీచరణ చిత్రాలయ సారధులతో శ్రీమతి శోభారాజు.



'అన్నమాచార్య భావనావాహిని' కార్యక్రమాలకై శ్రీమతి శోభారాజుగారిని అమెరికాకు ఆహ్వానించిన శ్రీ గుమ్మలూరి నరసింహశాస్త్రిగారిని పుష్పమాలాలంకృతుల్ని చేస్తున్న శ్రీ టి. సుబ్బరామిరెడ్డి.

# అన్నమాచార్యుని సంకీర్తన నిధి - భావనాపరిధి

—శ్రీ వేటూరి ఆనందమూర్తి

అన్నమయ్య భక్తకవి. గొప్ప వాగ్గేయకారుడు. జగత్కల్యాణ కారకమైన, తత్త్వచింతనతో కూడుకున్న భావసంపదతో పాటు దాని కీడైన సంగీత నృత్యముల స్పర్శ కూడా ఆయన పదాలలో ఉన్నదనుకోవడంలో అతిశయోక్తి ఏమీ ఉండబోదు. ఆయన సంకీర్తన రాశిలో సంగీత నృత్యముల స్ఫూర్తి కాస్త తెరమరుగు కావడమూ, ఆ వాగ్గేయకారుని పదరచనల వ్యాప్తి చెవిదాటై, కనుమరుగై, రూపుకట్టక పోవటమూ, నేడు మనకావిషయంలో సందేహాన్ని కల్గించ వచ్చునేమోగాని చారిత్రక పునర్నిర్మాణ దృష్టితో పరికిస్తే, అన్నమాచార్యుని పదకవితలు గేయపదాలై మాటకు, పాటకు, ఆటకు, మూటికీ సరస సమ్మేళనాన్ని కూర్చి నట్టివే అని అనిపించక పోదు. పైగా అన్నమయ్యే తనపాటల్లో చాలచోట్ల ఆ మూటి ప్రస్తావన చేసివున్నాడు.

లోకవ్యవహారంలో, మాటే వాక్యంగాను, పాటే గేయంగాను, ఆటే నృత్యంగాను, వ్యక్తమవుతాయి. గనుక ఆ వాక్యమే రసోద్దీపకమైన భావసంవాదంగాను, గేయం రసోన్ముఖమైన నాదవిన్యాసంగాను, నృత్యం రసాశ్రయమైన అభినయ విలాసంగాను. అన్నమయ్య పదాల్లో పొదుగొన్నవనుకోవచ్చును. మామూలుగానే భావబంధురమైన భాసుర వాక్యాన్ని ఆచ్ఛాదించుకొని కొంత శ్రావ్యగేయాంశం ఉంటుంది: సుమధురమైన శ్రావ్యగేయాన్ని ఆశ్రయించుకొని ఒక మనోజ్ఞమైన నృత్యముంటుంది. మనోహరమైన ఆ నృత్యాన్ని అవష్టంభించుకొని భాసుర వాక్యముంటుంది. కనుక సుందర నృత్యాన్ని మౌనవాక్యమనీ, సుమధుర గీతాన్ని అదృశ్య నృత్యమనీ, భాసుర వాక్యాన్ని సుప్తగీతమనీ మనం విడివిడిగా సంభావించుకోవచ్చు. ఆమూడూ ముప్పొంగిన అన్నమయ్య పదాలు గీతం, నృత్యం, భావం, రూపు, కట్టిన రసస్వరూపాలు. అందుకే అవి హాయిగాపాడుకోదగినవీ, భావన చేసి చదువుకోదగినవీ, అభినయం పట్టి ఆడుకోదగినవీను.

"ప్రతిభా సహితుడైన సహృదయుడు దినమునకొకటిగా భావించి ఒక వత్సరమీ పదమునందే లగ్నమనస్కుడైనచో అస్మృతమో విస్మృతమో యయిన ఒక సాహిత్య సర్వస్వము చక్కగా సంస్మృతమగును. ఇంక లోకమున సాహితీ చైతన్యమునకు మృతి ఉండనే ఉండదు" అని క్షేత్రయ్య పదాలను గూర్చి అభినవ భారతీ బిరుదాంకితులైన దర్శనాచార్యులు జమ్ములమడక వారన్నారు. ఆ మాటను మనం అన్నమయ్య పదాల విషయంలోనూ అన్వయించి అభిమానంతో, అభినివేశంతో, మననం చేయవలసి వున్నది.

'నాటకాంతంహి సాహిత్య' మ్మన్న సూక్తిలో సాహిత్య సాధనకూ, అధ్యయనానికి, నాటకమే పరమావధి అని మన ప్రాచీనులు భావించారు. అది వెనుకటి మాట. అన్నమయ్య క్షేత్రయ్యా మన దేశంలో

పుట్టి, తెలుగులో పదం పుట్టి పెరిగిన తరువాత పదమే సాహిత్యానికి పరమావధి అనీ పరమార్థమనీ ఈనాటి కనుకోవలసి వున్నది.

"నానాటి బ్రతుకు నాటకము
కానక కన్నది కైవల్యము
పుట్టుటయు నిజము పోవుటయు నిజము
నట్టనడిమి పని నాటకము" అన్నాడన్నమయ్య.

అట్టినాటకానికి-జగన్నాటకానికి-జీవిత నాటకానికి-ప్రతీక పదం. పదంలో లేనిది ప్రపంచంలోనే లేదనీ, ప్రపంచ స్వభావమంతా పదంలోనే ఇమిడి వుందనీ అన్నా దోషంలేదు. బ్రహ్మాండమైన బాహ్య సృష్టిరహస్యాన్ని నాటక రంగం ప్రదర్శిస్తే బ్రహ్మాండాన్ని అణువులో ప్రతిఫలింప జేసే అంతర దృష్టి రహస్యాన్ని పదం ప్రదర్శిస్తుంది. అన్నమయ్య పదస్వరూప మిలాంటిదె గనుకనే దానిని భావన చేసి ఆస్వాదించడానికి, మనకు చదువూ సంస్కార విశేషమూ ఈశ్వరానుగ్రహము ఉండాలి. విభిన్నములైన లలిత కళలలో ప్రవేశముండాలి. ఇవి పూర్వజన్మ అభ్యాసముల వల్లనూ అనుభవ పరిపాకము వల్లన్నూ ఆత్మోన్నతికని ప్రకాశింప జేసే ఉద్బోధం వల్లనూ పెంపొంద వలసినవి.

చతుర్విధ పురుషార్థాలకు, సర్వకళలకూ, భారతీయ సంస్కృతీ సర్వస్వానికి దేవాయతనమెలా నెలవో అన్నమయ్య పదమూ అలాగే! ఆలయం పురుష స్వరూపమని ఆగమజ్ఞులంటారు. అన్నమయ్య పదమూ అలాగే వేంకటనాయకమై పరపురుషుని హృదయాన్ని భద్రపరచిన భవ్యభారతీ సదనము. అన్నమాచార్యుని ప్రతి పాదమూ ఒక తిరుమల మందిరము.

వాఙ్మయ ప్రాంగణాన, చతుర్విధ పురుషార్థ ప్రాకారావరణాన, విమాన శిఖరాగ్రాన, గోచరించే విశ్వసృష్టికీ విజ్ఞాన దృష్టికీ ప్రతీక అన్నమయ్య పదం. శ్రీనివాసాలయమూ, తాళ్ళపాకవారి పద వాఙ్మయమూ ఏకమూ రసరాజమూ అయిన శృంగారాన్ని నిక్షేపించుకొన్న నిధులు. భౌతిక భంగిమల్లో మానవీయ శృంగారాన్ని చిత్రించే సంయోగ పరమానందము; భావభంగిమల్లో భక్తి శృంగారాన్ని వర్ణించే పరమాత్మసంయోగానందము! తత్త్వహితమైన మార్గాన, పురుషార్థ ప్రదం కావటం మనం రెండిటా చూడవచ్చు.

పదంలో పల్లవి పడికావలి గోపురం. ముద్రాంకిత పదం మూలస్థానం. మూడు చరణాలూ ప్రదక్షిణ పథాలు. వలచుట్టివస్తేగానీ పురుషార్థం దక్కి మనకు పరమార్థం దర్శనీయం కాదు.

అన్నమయ్య పదాలు మతము అభిమతము తొటుక్కొన్న సంకేతపు తొడుగులు. ఉద్వేగం మిక్కుటమైనప్పుడు ఒకొక్కసారి భావప్రకటనలో అంతశ్చైతన్యం వాక్కును మాటు పరచకుండా నగ్నం చేసివేస్తుంది. అప్పుడు అలా వ్యక్తమైన వాక్కులో-అన్నవారికీ-విన్నవారికీ-దృష్టి నగ్నత మీదకాక సహజ సన్నివేశాల నుండి ఉద్భవమైన ఉద్వేగాల అనుచర్వణం మీదనే సాగుతుంది. ఇక ఆ ఉద్వేగాలతున్నతి

కల్గించే సహజ పరిసరాలతో కూడిన విద్యాప్రశిక్షణతోడు పడినప్పుడు ఆ నగ్నతలోని బూతు బూతుగాక ఏదో నీతిని భావతీవ్రతనూ బోధించేది అవుతుంది.

దేవాలయం మీద బూతుబొమ్మలు ధర్మవిరుద్ధమైన కామపురుషార్థాన్ని తాత్త్వికంగా చిత్రించినట్లే దేవాయతన మనదగిన పదంలోని పదబంధాలూ కళాదృష్టిలో ఔచిత్యాన్నే ప్రదర్శిస్తాయి. పింగళి వారి మాటల్లో "రససిద్ధిగల చోట అశ్లీలమనేది లేదు అనే రహస్యమంత్రం మనవిచేస్తున్నాను. రసవిహీనమైతే పవిత్రమైన అర్థమైనా అనౌచిత్యమే అవుతుంది. కళలో అనౌచిత్యమే అశ్లీలము."

మన పదవాఙ్మయంలో అన్నమయ్య పదాలు ప్రశస్త రచనలు. అవి ఔచిత్యవిరాజితాలు దివ్యరస రాజ రాగరంజితాలు. కనుక వాటిలో అశ్లీలానికి ఎడమే లేదు. అందునా అవి ఉద్వేగ ప్రధానాలు. శ్రుతి లయలనే జోడుగుఱ్ఱాల మీద స్వారీ చేయటం అలవోకగా నేర్చుకొన్న రౌతుల్లాటివవి. అన్నమయ్య తన భావ వీధిలో ఏవో కొన్ని సుద్దులు కల్పించుకొని అట్టి సుద్దులకు రాగాసు రాగాల రక్షను నృత్యాభినయాల శిక్షను కల్పించి తెల్గునాట అక్షర కళాభిక్షను ప్రసాదించాడు. గీతాలాపనలో దాసరివలె ఉత్పులకుడై భక్తిజని తోద్యత్తాండవమాడుతూ విద్వత్సభారంజకంగా భవలాస్య ప్రదర్శనలిచ్చాడు. మానవీయ, భక్తిశృంగారా లకు సరస సమ్మేళనాన్ని కూర్చి అలంకారశాస్త్ర కామశాస్త్ర లక్షణ ప్రవచనానికి అవకాశమిచ్చేరీతి లక్ష్యనిరూపకంగా పదాన్ని ఒక విసూత్న ప్రక్రియగా ఆవిష్కరించినాడు అన్నమయ్య.

లక్షణజ్ఞులూ సంగీత సాహిత్య మర్మజ్ఞులూ సౌలభ్యంకోసం వివేచన చేసి ప్రపంచన దృష్టితో ప్రక్రియా భేదాన్ని భావించి తరువాతి కాలంలో కృతిని, పదాన్ని, కీర్తనను, తత్త్వాన్ని, పాటను, జావళిని వేరుచేసి చూపినారు కాని ప్రతి రచనలోను మరో ప్రక్రియలోని లక్షణముండదని కాదు. కాని తాళ్ళపాక వారి పదాల రాశిలోని వైశిష్ట్యమేమంటే అందులోనే అన్నింటికీ లక్ష్యాలనదగినవి ఉన్నాయి. సామాన్యులూ పాడుకో దగినది కాబట్టి పాట. తాత్త్విక చింతనమున్నది కాబట్టి తత్త్వం. శ్రీనివాసుని గుణకీర్తన మున్నది కాబట్టి కీర్తన. అభినయ సాధ్యమైనది కాబట్టి పదం. రాగ తాళాలతో విస్తరించి నేడు సభారంజకంగా ఆలపించ దగినది కాబట్టి కృతి ! శృంగారంలో ఎక్కడైనా ఐహిక దృష్టి నతిక్రమించ లేకపోతే జావళీ ! కనుక అన్నమయ్య పదమే మీదికాలంలో ఈ అన్నీ కాదగిన శక్తి కలిగిన విత్తువంటిదనవచ్చును. విత్తులో విస్తరించిన వృక్షం కానరాదేమో గానీ వృక్షంగా విస్తరించ దగిన శక్తి అంతా విత్తులో ఉన్నదంటే విస్తు పోవలసిన అవసరం లేదు. విస్తరించిన ఆ వృక్షంనుండి రాలిన విత్తులే చెదరి వేర్వేరు తావులపడి కొత్తగా మొలకెత్తుతాయన్నా వింతలేదు. ఆకు చిదిమి చెట్టు లక్షణం గుర్తెరిగినట్లే నేటికి శ్రవణ గోచరమో దృగ్గో చరమో అవుతున్న పద ప్రక్రియల్లోని విశేషాలను పసికట్టి వెనక్కి పునర్నిర్మించుకొంటూ వెడితే అన్న మయ్య నాటి పదంలోని వాగ్గేయాల స్వరూపమూ మన అందుబాటులోకి వచ్చి అవగాహనకు రాకుండా పోదు. రామదాసు కీర్తనలూ, క్షేత్రయ్య పదాలూ, సారంగపాణి జాతీయములు, గుత్తెనదీవి, అధ్యాత్మ రామాయణాది సంకీర్తనలు : త్యాగరాజాదుల కృతులు, ఇంకా కన్నడ హరిదాసుల పదగళు-అలా కొత్తగా మొలకెత్తిన చెట్ల ఆకులకు సాక్ష్యాలైతే; అన్నమయ్య కాలంనాటివే అయిన స్వరసహిత సంకీర్తన శిలా ఫలకాలు ఆ వెనుకటి పదవృక్షానికి సంబంధించిన శిలాజరూపమైన సాక్ష్యాన్ని (Fossil evidence) అందిస్తు

న్నవి. వాటిని నిశితంగా పరిశీలించి, పరిశోధించి, అన్నమయ్య నాటి పద స్వరూపాన్ని పునర్నిర్మించి ఆవిష్కరించటం మన విధి. ఆ పనికి మనం ఏమీ దోహదం చేయకుండా అసలు అన్నమయ్య వాగ్గేయకారుడే కాదనో అన్నమయ్య పదాలలో సంగీతమే లేదనో, ఆయన ఏవో కొన్ని తత్త్వాలు భావప్రధానంగా, ప్రచారదృష్టితో, ఎవరుపడితే వారు, ఎటుపడితే అటు, తోచిన విధంగా రాగతాళాలమర్చుకొని పాడుకోడానికి వీలుగా మాత్రమే రచన చేశాడనో తలచి ఊరుకొంటే మాత్రం ఆయనకు మనం న్యాయం చేకూర్చనివాళ్ళం కాక పోతాము. ఆయన వాగ్గేయకారు డనడంలో సందేహం అవసరంలేదు. ఆయన పదాల్లో సంగీతం లేదనడం న్యాయంకాదు. నృత్యాభినయాలను తన పదాలలో ఆయన భావించనే లేదనడమూ భావ్యంకాదు. ఎందుకంటే వాటికెంతో అవకాశమిచ్చే పదాలాయనవి. వేలకొద్దీ కాకున్నా వందలకొద్దీ అయినా మనం ఆ రచనల్లో పసికట్ట వచ్చు. అంతేకాదు అప్పటికే ఆ రంగాన సిద్ధమైన సంప్రదాయమూ కొంత ఆయనకు దోహదం చేసివుండె ననీ భావించ వచ్చును.

పద సాహిత్యంలో పరస్పరం గోచరించే భావరచనా సంవాదాలూ, అన్నమయ్య కీర్తనలే కొన్ని తర్వాతి కాలంలో క్షేత్రయ్య పదాలుగా సంప్రదాయంలో నిలిచివున్న సన్నివేశాలూ; రేకుల్లో వున్న అన్నమయ్య పదాలే కొన్ని గుత్తెనదీవి రామాయణ రచనలుగా ఇటీవల గుర్తింపబడిన సందర్భాలూ మనకా పరిశోధనరంగంలో మార్గం చూపవలసి వున్నవి. ఇప్పటికి ముప్పైఆరేళ్ళకు పూర్వమే పిత్రపాదులు ప్రభాకరులు సంకీర్తన శిలాఫలకాల నుద్ధరించి మన దృష్టికి తెచ్చినా నేటికీ వాటిలో ఏముందో సమంగా పరిశీలించే పరిశ్రమకు మనం పూనుకోలేదు. అది మన విధి లోపమేకాని దుస్సాధ్యమని నేననుకో వటంలేదు. ఇవి చేస్తే సంప్రదాయం కొంతవరకైనా పరిరక్షిత మవుతుంది. ఈనాటికి క్షేత్రయ్య పాట సంప్రదాయమూ గుత్తెనదీవి రామాయణగానము మనకెంతమాత్రం మిగిలివున్నవో ఆనాళ్ళకిన్నీ అంటే ఆయా రచనా కాలాలనాటికీ — అన్నమయ్య పాట సంప్రదాయమూ అమాత్రం నిలిచివుండే వుంటుంది. కనుక అవిచ్ఛిన్నమైన ఈ సంప్రదాయ శృంఖలలో ఏ కొన్ని లంకెలు పోయినా సంప్రదాయం శిథిలమైపోయే ప్రమాదమున్నది. మరి అలాగే దానిలో ఏ చిన్న లంకె దొరికినా దాన్నిబట్టి తత్పూర్వస్వరూపాన్ని చారిత్రకంగా పునర్నిర్మించుకొనే అవకాశమూ వుంటుంది. కనుక సంప్రదాయాన్ని గుర్తించి పరిరక్షించుకో డంలో మనం ప్రాలుమాలకూడదు. పద సాహిత్యాన్నంతా సమగ్రంగా శోధించి ప్రకటిస్తే గానీ చెదరిపోయిన ఆ లంకెల్ని గుది గ్రుచ్చుకోడానికి మన కవకాశముండదు. ఆ పని మనం ఎంత తొందరగా నిర్వహింప గల్గితే అంత మంచిది.

ఈ నేపథ్యంతో ఇప్పుడు కొంత అన్నమయ్యగారి సాహిత్య సౌందర్య సమారాధనం :-

అన్నమయ్య సాహిత్యం ఒక పాలకడలి. అందులోనే ఒక కల్పతరువూ పుట్టింది. ఒక అమృత కలశమూ ఆవిర్భవించింది. ఇంతకూ హితాన్ని అందించేది, అమృతాన్ని వర్షించేదే, కదా సాహిత్యము ! మరి అన్నమయ్య సాహిత్యం సంకీర్తనాత్మకమై యుండి వాగర్థాల వివేచనవల్ల జగద్ధితాన్ని, శ్రుతిలయల మేళవింపు వల్ల గాన రసామృతాన్ని పంచి పెడుతుందంటే ఆశ్చర్యమేముంది ? ఎన్నడూ 'విన్నవి విన్నవి, కావుగదరా యీ పదములన్నమార్యునివి మోహనమూర్తు' లనే విధంగా రారాజుల తల కెక్కినవీ, రసిక వర్యులెద మెచ్చినవీ అయిన అన్నమయ్య పదాలు - ఉత్తవావాతి మాటలూ, పైపై వన్నె పదాలూ, కాక ఆ

శ్రీనివాసుని చొక్కజేసినవీ ఆ స్వామివాది ముద్రమోచినవీను. ఆయన సాహిత్య సర్వస్వాన్నీ సంకీర్తన సంచయాన్నీ మనుమడు చినతిరుమలాచార్యుడు ఇలా ప్రస్తుతించాడు.

"శ్రుతులై శాస్త్రములై పురాణకథలై సుజ్ఞానసారంబులై యతిలోకాగమవీథులై విపుల మంత్రార్థంబులై నీతులై కృతులై వేంకట శైలవల్లభరతిక్రీడా రహస్యంబులై నుతులై తాళ్లపాక యన్నయవచో నూత్నక్రియల్ చెన్నగున్" అని అన్నమయ్యగారి 'వచోనూత్న క్రియలు' సాహిత్య విద్యాతత్వ మెరిగిన వారి సతులూ నుతులూ అందుకొన్నట్టివి.

సంకీర్తన రూపాన గల అన్నమార్యుని వచోవైభవాన్ని వినుతించిన ఈ పద్యం కేవలం సన్నుతే కాక 'అల్పాక్షర మసందిగ్ధం సారవద్విశ్వతో ముఖమ్' అన్నట్టు కావ్య మీమాంసను సంబంధించిన కవి రహస్య అధికారణానికి సూత్రప్రాయమైన సంక్షిప్త ప్రతిపాదనం. అందే అన్నమయ్యగారి ప్రతి పదము వేదోపవేదాత్మకము, సార్వవర్ణికము, పంచమవేదము అనదగిన గానవేదమన్న మాట! అంతే కాదు 'అలంకృతియు జమత్కృతియు' గలిగిన ఆయన ప్రతికృతీ సకల విద్యాస్థాన ఏకాయతన మనదగిన ఒక్కొక్క కావ్యమన్న మాట! అందే నాలుగు విద్యల సారాన్నీ జీర్ణించుకొని ఐదోవిద్య అనిపించుకొన్న, సాహిత్య విద్యా రహస్యాన్ని నిక్షిప్త పరచుకొన్న, సంక్షిప్త రచన ఆయన సంకీర్తనమన్న మాట!

ఈ దృష్టితో చూస్తే ఆ ప్రస్తుతి పద్యంలోని అనుధాతు స్వార్థకాంతులు గల పదబంధ ప్రక్రమాలన్నీ సార్థకాలుగానే కనిపిస్తాయి. శ్రుతులై అనడంలో అపౌరుషేయ శాస్త్ర విషయాన్నీ, త్రయీసారాన్నీ; శాస్త్రములై అనడంలో పౌరుషేయములైన విషయాలన్నీ; ఇలాగే క్రమంగా పురాణేతిహాసాల్నీ, విధి వివేచనీ బ్రహ్మ నిదర్శనీ రూపాలు గల మీమాంసాసారాన్నీ; సమస్త విద్యాస్థానాలకూ ఏకాయతన మనబడిన కావ్యం యొక్క గౌరవాన్నీ; సూక్ష్మములైన ధర్మార్థముల రహస్య మెరిగించే సాహిత్యవిద్యనీ; ఆ విద్యల వల్ల కలిగే సకలాభ్యుదయాలకూ సుఖలోక యాత్రకు సాధనమైన నీతినీ; కవి కర్మమూ కవితా ధర్మానికి రూపు కల్పించే కృతినీ; వాగర్థాలవలె పరస్పరానుకూల్యంతో కలిసివుండే సాహిత్యవిద్యనీ; క్రమంగా ఇందులో స్మరించినట్లైంది. పర్యవసాన మేమంటే సర్వశాస్త్రాల్నీ, శాస్త్ర పూర్వకాలైన సర్వ కావ్యాల్నీ లోగొన్న వాఙ్మయ స్వరూపాని కంతటికీ అన్నమయ్యగారి సంకీర్తనలు సంగ్రహ ఉదాహరణలో, స్పష్టదర్పణాలూ అని; అందుచే ఆయన వేరే ప్రబంధాది ప్రక్రియల జోలికి పోలేదు. 'చాటూక్తి పదబంధ కవితారక్తుండై' ఆయన ఇతర వాగ్విరక్తుండైనాడట!

ఇలా వాఙ్మయ మణిదర్పణాలుగా నాటి కాలానికి తగ్గరీతిని పదకవితను పరిశుద్ధపరిచి తరువాతి కాలాల వేళ సాహితీపరులకు మార్గదర్శకంగా వుండేలాగ దానిని ఆవిష్కరించడంలోనే ఆంధ్ర సంకీర్తన లక్షణకారుడు గుర్తించిన ఆ 'నూత్నక్రియ' వున్నట్లుంది!

"కలియుగంబునను కలదిదియే
వెలసిన పంచమవేదమె కలిగె" (11-2-60)

అని పాడుకొన్న అన్నమయ్యగారి ఆత్మప్రత్యయమూ అదే. అందుకే ఆయన తరువాతవాళ్లు 'కదిసి జన్మసంగానని సంకీర్తన మదన నుపదేశించే' నన్నమాచార్యుడు అనుకొన్నారు. ఆయన దయాళువు. హితోపదేశకుడు అసలు ఆయనదృష్టిలో విష్ణుతత్త్వానికీ, హితరూపమైన సంకీర్తన ప్రక్రియకీ, పురుషార్థ ఫలరూపమైన ఆ వేంకటనాథుని మూర్తికీ వేర్వేరులేదు. స్వామిరూపానికీ సంకీర్తన స్వరూపానికీ అభేదం. వాటిని ఆశ్రయించుకొనే విష్ణుతత్త్వమూ వ్యాపిస్తున్నది. సర్వవాఙ్మయమూ పొదకట్టుతున్నది. కలివేళ తత్త్వహిత పురుషార్థాల నాకళించుకొన్న ఈ సంకీర్తన ప్రక్రియారూపాన ఆయన దర్శించినదీ ఎదలో అమ్మవారి నిడుకొన్న స్వామివారినే- ఆయన పాడుకొన్నదీ ఆ అలమేల్మంగా శ్రీనివాసుల లీలావిలాసాలనే. ఆయన కడుగడుగునా, ప్రతిపదాన, ఆస్వామివారే సాక్షాత్కరించారు. గొంతెత్తిపాడినా చేయెత్తి చాటినా ఆయన చెప్పదలచుకొన్న సత్యమదే. 'చాటెద నిదియే సత్యము సుండో చేటులేదితని సేవించినను' అంటూ ఆయన తనకేలుచాచి చూపినదీ, చాటిచెప్పినదీ ఈరహస్యాన్నే. 'వైష్ణవులు కానివారెవ్వరు లేరు విష్ణుప్రభావ మీవిశ్వమంతయు గాన' 'చాలదా బ్రహ్మమిది సంకీర్తనం'. ఒక్క సంకీర్తనే చాలు ఒద్దికై మమ్ము రక్షింపగా' 'శ్రీ వేంకటేశుడు శ్రీపతియు ఇతడే పావనపు వైకుంఠపతియు నితడే' అన్న పాట లన్నింటిలోని పరమార్థమూ అదే.

అందుకే 'వేమారునుంబాడిపాడి పావనముగావో జిహ్వ బ్రదుకవో జీవుడా' అని ఆయన బోధచేశాడు అన్నమయ్య కంఠాన్ని ఆలంబనం చేసుకొని బహిర్గతమైన గీతము; చాచిన కుడిచేత సంకేతితమైన పరమార్థము- స్వామివారిని నిరూపిస్తూనూ, సంకీర్తననిధిని నిర్దేశిస్తూనూ వుండగా ఆయన సంతతివారంతా సంకీర్తనంలోనే స్వామివారిని సేవించుకొంటూ, ఆ ముంగిటనున్న మూలనిధిని, పైతామహమైన ధనాన్ని, కాపాడుకొంటూ, సంకీర్తన భాండాగారాన్నే స్వామివారి ఆలయంగాను శ్రీహరికి వాసంగానూ భావించుకొంటూ, తరించారు. సంకీర్తనలో స్వామిని చూపించాడు అన్నమయ్య. స్వామిని సంకీర్తనలోనే చూసుకొన్నారు ఆయన సంతతివారు. మరి స్వామివారేమో 'ఇంపొంద వైకుంఠమిదియె సుమ్మనుచు సొంపొంద వలకేల' చూపిస్తున్నాడట తన వరదహస్తముద్రతో! తిరుమలమీదనున్న మూలమూర్తులూ శిల్పాకృతులూ అన్నీకూడా వలకేలు రహస్యాన్నిలా విశదం చేస్తున్నాయి. 'కట్టెదుట వైకుంఠము కాణాచయినకొండ' అని అన్నమయ్య పాడుకొన్నదందుకే. వేదములే శిలలై వెలసిన తిరుమలకొండ గానరూపమై అన్నమయ్య భావనలో హరివాసమేకాక, 'పదివేలశేషుల పడగలమయమూ' అయింది 'అదివో అల్లదివో శ్రీహరివాసము పదివేలశేషుల పడగలమయము' అన్న సుప్రసిద్ధ కీర్తనలో అన్నమయ్య సప్తగిరిని పరగిరిగాను, స్వరగిరిగాను భావించినట్టున్నాడు: అదివో అనడంలో హరివాసమైన ఆక్షేత్రాన్ని నిర్దేశిస్తూనే అల్ల+అదివో అన్న పునరుక్త పదబంధంచేత హరికి వాసము నిజంగా సంకీర్తనమందే కాబట్టి ఆదే సంకీర్తన నిలయమనీ సప్తస్వరగిరి అనీ వ్యంజింప జేస్తున్నాడు కవి. పదివేలశేషుల పడగల మయము అనడంలో శేషశైలాన్నేకాక అనంత సంకీర్తన వాగ్వైభవాన్ని సర్వవాఙ్మయ స్వరూపమైన సంకీర్తనా కృతిని స్ఫురింపచేస్తున్నాడు. అన్నమయ్య పసివాడుగా మొదటిసారి కొండ ఎక్కిననాడే, మోకాళ్ళ ముడుపు దగ్గరే ఆయనకా కొండ 'మరకతశ్యామ నిర్మల నిజాకృతులతో వేణునాదము సేయు వెన్నుడో' అన్నట్లుగా దర్శనమైనదట. అక్కడి వెదురుపొదల్లో 'గణుపు చెంగట వాటమైన తుమ్మెద తొలుల సందుల చల్లగాలి రాణదూరగ వింత రాగాలు

పొడగి' వినిపించినాయట. ఇక ఆ సప్తగిరి స్వరగిరి అయిందనుకోడంలో వెలితి ఏముంది? అదె వేంకటాచల మహిమోన్నతమట. 'విన్నంత బాప సంమముల న్నియు నదపంగ బూటయగు తాళ్ళపాకన్నయ పదములు పాడినయన్నయ కోవిదుల వేంకటాధిపుడేలున్' అని చినతిరుమలాచార్యుడననే అన్నాడు. అది ఆనందమయం. రసానందమయం. ముంగిట నల్లదివో మూలనున్న ధనము. అదే పైతామహంబైన సంకీర్తననిధి. బంగారు శిఖరాల బహుబ్రహ్మమయము అనడంలో పల్లవశిఖాపదాల నిర్మాణంతో బ్రహ్మనిరూపకమైన సంకీర్తనమూ ధ్వనిస్తుంది. ఆ వెంకటనగము కైవల్యపదము. సకల సంపదల రూపము. పావనములకెల్ల పావనమయము. సంకీర్తనమూ అలాగే- చినతిరుమలయ్య చెప్పినట్లు పావనము, విభవాస్పదము, తుదిపదము అయినట్టిదే.

సంకీర్తన స్వరూపమూ ఆ శేషాచలమువలె, స్వామివలె వేంకటమే. ఆనందమయమే. ముంగిటనున్న మూలధనమే. బంగారు శిఖరాలతోను పల్లవశిఖాపదముల నిర్మాణంతోను బ్రహ్మనిరూపకమైనట్టిదే. సంకీర్తనమూ ఆ వెంకటనగమువలెనే పావనము, విభవాస్పదము తుదిపదము అయినట్టిదే: అన్నమాచార్యుడానతిచ్చిన సంకీర్తన సాహిత్యస్వరూపం ఎంతో గంభీరమైనది. అదొక పాలకడలి. ఆ క్షీరాబ్ధి ముందు నిలబడి నివ్వెరపోవడమేతప్ప మనయీ చిన్నిచేతులతో అందని క్షీరాన్ని ఎంతని గ్రోలగలం?

నిగనిగలతోడి నీలమాణిక్యమువలెవున్న స్వామివారు అన్నమయ్య చూపులకు అల్లో నేరేడుపండు చవినేకాక ఆయన పాటల్లోనూ మన వీనులకు 'అల్లో నేరేళ్ళన్న పదప్రక్రియలోని రుచినీ అందించినాడు. అలాగే ఆ మంగమ్మతల్లి చక్కదనాన్ని తలపోసుకొని 'చాంగుభళాలు' ఆలపించుకొన్నాడు. తీరికవేళల ఏవేవో సుద్దులు కల్పించుకొని తనివితీర పాడుకొన్నాడు. ఆ భావవీధిలోనే ఏ శ్రీరంగ శిశువునో, ముద్దుగారే యశోదముంగిట ముత్యాన్నో తలపోసుకొని డోలలూచి లాలిపాటలు, జోలపాటలు పాడుకొన్నాడు. నవరత్న కీర్తన నాలపించాడు. పెండ్లి వేడుకల్లో విందుల్లో శోభనాలు, ధవళాలు, మంగళాలు వినిపించాడు. సువ్వాలలు పాడాడు. గొబ్బిళ్ళు తట్టాడు. సోదులు చెప్పించాడు. గొల్లపడుచులచేత చల్లలమ్మించాడు. చిందులు తొక్కించాడు. వెన్నెలవేళల పరాళిరాగంలో విరహగీతా లాలపించాడు. మేడలెక్కి శృంగారపదాలు పాడి ఏలల్లో వెన్నెలవేళ ఓలలాడించాడు. ద్రావిడవేదాన్ని తెనిగించాడు. తత్త్వసారాన్ని ప్రపంచించినాడు. ఆధ్యాత్మకీర్తనల్లో, భక్తిభావ విశ్లేషణలో అనుభూతి పరిధుల్లో వ్యాస నారదాదులనే అధిగమించి నానావిధ భక్తుల్ని ప్రతిపాదించాడు. శృంగారవీధిలో అనంతరకాలాన వచ్చిన ఆలంకారికులకు చాలినంత పని కల్పించాడు.

అయితే ఈవిషయంలో ఒక చిన్నకొరత మిగిలిపోయింది. మన పద వాఙ్మయ వికాసానికి అన్నమయ్య ప్రాతిపదిక కల్పిస్తే ఆ ప్రాతిపదికమీదనే మరింత పెంపు చేకూర్చి క్షేత్రయ్య దానికి పరాకాష్ఠ కల్గించినాడు అట్టి క్షేత్రయ్య పదాలను కొన్ని ఎన్నుకొని లక్ష్యాలుగా వాటిని ఉదాహరించి భానుదత్తుని రసమంజరీ లక్షణాని కన్వయించి పేరుతెలియని అజ్ఞాత భావుకుడొకడు లక్ష్యలక్షణ కమన్వయ పూర్వకంగా 'శృంగార రసమంజరి' నావిష్కరించినాడు. పదసాహిత్య చరిత్రలోనే ఆదొక అపూర్వ సన్నివేశము. అట్టి కృషి కొంత తాళ్ళపాక కవిసంతతివారి మూలాన అమరు శతకానికి జరిగింది. కాని అన్నమయ్య పదాలకు జరుగకపోయెగదా అన్న చింత నాకుంది. నేటికైనా ఆ శృంగారరసమంజరిలోవలె కావ్య మర్మజ్ఞులెవరైనా

అక్బర్‌షా శృంగారమంజరిని, శారదా తనయల రచనలను జీర్ణించుకొన్న సమర్థులు, కొన్ని అన్నమయ్య పదాలకైనా అట్టి లక్ష్య లక్షణ సమన్వయ పూర్వకమైన వ్యాఖ్యను గావిస్తే బాగుండును. దేవస్థానం ఆ కృషికి పూనుకొనునుగాక అని నా మనవి.

ఇంతకూ తాళ్ళపాకవారి పదకవితా ప్రభావం సమకాలంవారి మీదా సమీపకాలంవారిమీదా చెప్పుకో దగినంత పడిందనే చెప్పాలి. 'తాళ్ళపాకవారి కవిత్వం కొంత అందులో మన పైత్యం కొంత' 'గండరం వైష్ణవం' వంటి సామెతలు పలుకుబళ్ళు నేటికీ చిత్తూరు మండలంలో వినవస్తూనే వుంటవి. ఆ పలుకుబడి అలా చెల్లుబడి కావడానికి హేతువులు తాళ్ళపాకవారి రచనల్లోని తెలుగుదనము, భావనాబలము, గేయ మాధుర్యము సర్వసమ్మతమైన మత దృక్పథము అని చెప్పవచ్చు. తాళ్ళపాకవారి సాహిత్యాన్ని సంపూర్ణంగా చదివి ఆ పరిజ్ఞానంతో తరువాతి కాలపు ప్రబంధ వాఙ్మయాన్నో, యక్షగాన సంచయాన్నో, పద రచనా సంప్రదాయాన్నో పరికించినట్లైతే ఆ పలుకుబడి ఎలా చెల్లుబడి అయినదీ మన కవగతం అవుతుంది. అంచేత ఆ దృష్టితో మన సాహిత్యాన్ని మళ్ళీ మనమింకొకసారి పరిశీలించవలసిన అవసరం కనిపిస్తోంది.

అన్నమయ్య వర్ణించిన కొలది వెట్టగరాని కొమ్మ సింగారమే కొరవంజి రచనల్లోని సింగి సొగసుగా పరిణమించింది. 'వెలది చక్కదనము వేరొకటి కాదు సుడి చెలులారచూడరమ్మ చెప్పరాదు వింతలు' 'అడినీరంటే' ఎన్న శక్యముగాదుగా సింగి సొగసెన్న శక్యము కాదుగా' అని వారన్నారు. 'సిందు చందురుడిమీద నీలాలగని పుట్టె కొండవంటి చెలికపే కురులాయను – అలుల నారివిల్లు అతనికైతే నీకు అలుల బొమ్మలిండ్లవె రెండు గనవే! అని వీరు పాడితే 'సురలింద్రనీలములు వదనము చంద్రునిబోలు బొమలింద్ర చాపములు చూపులు మరుబాణములు' అన్నారు వారు. 'తుంట విల్లొకటినీది తునియని విండ్లు చెలియ కన్బొమలు' అన్న క్షేత్రయ్య భావన అన్నమయ్య రచనకు చేకూర్చిన పెంపే. ఇలా సామ్యాలు చాలా ఎన్నవచ్చు. కొలది వెట్టగరాని కొమ్మ సింగారపు సొబగుల్ని భావించరే చెలులు అంటూ అన్నమయ్య పాడిన పాట ఇది :-

చెలియ పెద్దతురుము చీకట్లు కాయగాను
ఎలమి మోము కళలు ఎండకాయగా
బలికి రాతిరియు బగలు వెసుకముందై
కలయ నొక్కట మించీగంటిరటే చెలులు (18–513)

కొమ్మ సింగారాన్ని ఇంత గొప్పగా పాడిన ఇలాటి పాటల్నే 'సింగారమొక కుప్పచేసిన కరణి రంగైన రాగ వర్ధములబడుటయు తవిలి యెన్నిన గాళిదాసాదులైన కవులందు జిక్కన కవులందు నిట్టి కవితయు నిట్టి శృంగార భావంబు వివరింపగంటిమే వింటిమే మున్ను' అని నరసింగరాయడు వీనులవిందుగా విని చాలమెచ్చి, బంగారు వ్రాత కచ్చడాలు కెంబట్టు కుళ్ళాయి అంగదాలు ఉభయాతపత్రాలు, వింజామరల జోడు, గించికడి కళాంబిక వగైరాలన్నీ ఇచ్చి సన్మానించినప్పటి పాట ఇదేననిపిస్తుంది నాకు. అసలుగా "పద కవితా పితామహు"డైన అన్నమయ్య పాడిన ఈ శృంగార కీర్తన అద్భుతమైన కవితా భావనతోను రచనా రీతితోను కూడుకొన్నది. ఇది చదివిన తర్వాత కృష్ణదేవరాయలచేత గండపెండేరం తొడిగించుకొన్న

"ఆంధ్రకవితా పితామహు"డైన అల్లసాని పెద్దన అసలు కవిత అంటే ఇలా వుండాలి అని ఆశవుగా చెప్పిన ఉత్పలమాలికలోని చరణాలు మనకు స్మరణకు రాకమానవు. అచ్చతెల్గులో కవిత చెదితే జిగ్గు నిగ్గు వెనగా వలె గమ్మున గమ్మనన్వలెన్-సొగసు కోర్కులు రావలె నాలకించినన్- రాతిరియున్ బవల్ మరపురాని హొయల్ చెలియార్కులజపు సిద్ధాతరతీ పూలంబలెదు తారసిలన్ వలె లోదలంచిన్నన్' అన్న పంక్తుల్లోని భావాలు అన్నమయ్యగారి చరణాల నాశ్రయించినవే అని అనిపించకపోదు మనకు. మేఘాలు మూగినట్లున్న ఆ కొప్పు తురుము చీకట్లు కమ్ముతుండగా మోముదమ్మి పగటిశోభను కూరుస్తుండగా, రాతిరియుంబవల్, కలియక, ఒక్కటిగా అతిశయించిన భావన ఇందులోని విషయం.

కాలక్రమాన ముందుగా రాత్రి వెనుక - అంటే ఆ తర్వాత పగలు రావలసి వుండగా, స్థలక్రమాన తలకు ముందుభాగాననే పగలు, వెనుక అంటే తల వెనుక భాగాన రాత్రి ఆక్రమించుకొన్నట్లుండడం - అదీ ఏక కాలాన ఆ కొమ్మనాశ్రయించుకొని కలియకుండా, ఉండడం కవితా భావనలోని వైచిత్రి. 'వెనక ముందై' అన్న పదబంధం వల్ల ఆ వైచిత్రిని కవి యిందులో సాధించినాడు, అలాగే రెండో చరణంలో అచల యుగ్మాన్ని మీరే కుచయుగం పొదవు పెరుగగా అందమైన నెన్నడుము బయలైవుండగా కొండలూ మిన్నూ, లోకరీతికి భిన్నంగా కిందూమీదై, ఒక్కచోనే, చెందివున్నవన్న వర్ణనలోనూ అట్టి వైచిత్రే కానవస్తుంది.

మొత్తంమీద "కొలది వెట్టగరాని కొమ్మ సింగారం" భావుకుని క్రిందుమీదు పరచే విధంగా అన్నమయ్య పదంలో వర్ణితమైంది ఇంతేకాదు ఇంతి చెలువపు రాశిని, వెలది సింగారాలను వింత బాగులను పరి పరివిధాల వర్ణించిన అన్నమయ్య పదాలన్నీ ఇట్టివే. ప్రత్యేకంగా పరిశీలింపదగినవి. ఇవి తరువాతి కాలపు ప్రబంధ కవులకు, పదకవులకు, యక్షగాన రచయితలకు భిక్ష పెట్టినవి. అందుకే ఇట్టి ఈ రచనలను తులనాత్మకంగా మనం ఇంకొకసారి అధ్యయనం చేయవలసి వున్నది అనుకోవడం. దానివలన నూతన దృక్పథంతో కూడిన పరిశోధనా సాగుతుంది. అధ్యయనంలో రసానందాన్ని అనుభవించే పరితృప్తి మనకు మిగులుతుంది. వీలైనప్పుడల్లా ఇక మనమాపని చేద్దాము ! !

# అన్నమయ్య ఆధ్యాత్మికత

— డా॥ బాలాంత్రపు రజనీ కాంతరావు

భూపాళం - చాపు

అన్ని విభవముల అతడితడు
కన్నులు వేవేలు కల ఘనుడితడు ॥

వేదాంతకోట్ల విభుడితడు
నాదబ్రహ్మపు నడుమితడు
ఆది నంత్యములకు అరుదితడు
శ్రీదేవుడు సరసిజనాభుడితడు ॥

భవములణచు యదుపతి యితడు
భువనములిన్నిటికి పొడవితడు
దివికి దివమైన తిరమితడు
పవనసుతునేలిన పతియితుడు ॥

గరుడని మీదటి ఘనుడితడు
సిరులిందరికినిచ్చే చెలువితడు
తిరువేంకట నగము దేవుడితడు
పరమ పదమునకు ప్రభువితడు ॥

'నాద సుధారసంబిలను నరాకృతాయెరా' అన్న త్యాగరాజస్వామి దృష్టిలో ఆ నరాకృతియైన శ్రీరాముడే శ్రీమహావిష్ణువుకూ ఆయన అవతారములన్నిటికీ మూల విరాట్టు! ఆ ప్రణవమూర్తియే ప్రాణానల సంయోగముతో సప్తస్వరములై పరగెనంటాడు! శ్రీరామోపాసనా నాదోపాసనా ఆయనకు ఉచ్ఛ్వాస నిశ్వాసాలు!

తెలుగులో ఆది వాగ్గేయకారుడైన అన్నమాచార్యులవారుకూడా త్యాగరాజస్వామి వలెనే నాద బ్రహ్మోపాసియే అనడానికి దృష్టాంతముగా నా అల్పమైన పరిశోధనలో ఒక్క కీర్తన లభించింది. అందులో అన్నమయ్య వేంకటేశ్వరస్వామియే అవతారములకు విభవములకు అన్నిటికీ మూల విరాట్టుగా స్తుతించారు, ఇంకా అనేక కీర్తనలలో స్వామివారిని ఆదిమూలమనీ, మూలభూతమనీ వర్ణిస్తారు. ప్రస్తుత కీర్తనలో

వేదాంతకోట్ల విభుడైన స్వామిని నాదబ్రహ్మపు నడుముగా నుతిస్తారు. ఆద్యంతములకు అరుదు అంటే ఆద్యంతములు లేని - స్వామికి ప్రతిరూపం అయిన అన్నమయ్య గారి ఓంకారం - అకార ఉకార మకారముల సమ్మేళనమయిన ప్రణవం - అదే - నాదబ్రహ్మం - అకారం బ్రహ్మార్థకమూ, ఉకారం విష్ణ్వర్థకమూ మకారం శివార్థకమూ - అనే అభిప్రాయం కంటే భిన్నంగా - స్వామివారిని 'ఆద్యంతము లరుదైన నాద బ్రహ్మపు నడుము' అని వర్ణించడముచేత - అన్నమయ్య గారి దృష్టిలో - స్వామివారు సృష్టి స్థితిలయముల మూడింటికీ మూలదైవమనే కాకుండా ఆద్యంతరహితుడైన - సంపూర్ణ నాదబ్రహ్మ రూపుడే - శ్రీ స్వామివారని మనం అర్థం చేసుకోవాలి. పరమపదమునకు ప్రభువైన ఈ స్వామి గరుడ పవనసుతుల తిరు నక్షత్రాలయిన శ్రవణం, స్వాతి మండలాల నడుమ ఉత్తరాకాశంలో ఆయా ఏకాదశుల రాత్రులందు ఉత్థానము, శయనమూ పరివర్తనము చేస్తూ మనకు నిత్యం దర్శనం ప్రసాదిస్తూంటాడు.

అన్నమాచార్యులు రచించారని చెప్పుతూన్న 30 వేలకు పైబడిన కీర్తనల్లో రాగి రేకులద్వారా దాదాపు 15 వేలు మాత్రం మిగిలాయి. మిగిలిన కీర్తనల రేకులు స్వార్థపరుల చేష్టితాలవల్ల కాలగర్భంలో కలిసి పోయాయి. అచ్చయిన కీర్తనలు ఇప్పటికి 10 నుంచి 12 వేలుంటాయి. వీటిలో 3, 4 వేలు మాత్రం అధ్యాత్మ కీర్తనలనీ మిగిలినవన్నీ శృంగార కీర్తనలనీ పరిశోధకుల అంచనా !

"వైరాగ్య వృద్ధికర గంభీర పద శ్రేణి పొసగ వెనుపుచు నగ్రా
మ్యారమ్య విష్ణు చరితోదారములై యున్న చాలు ధరణిన్ వెలయున్
దేహాత్మేశ వివేకోత్సాహంబును లోకవేద ధర్మా ధర్మా
ద్యూహా పోహంబులుగల యాహరి సంకీర్తనంబు లధ్యాత్మంబుల్".

అన్నమయ్య గారి అధ్యాత్మ సంకీర్తనములు వైరాగ్య వృద్ధికరములు, విష్ణుచరితోదారములూ, దేహము, ఆత్మ, పరమేశ్వరుడు వీటిని గూర్చిన వివేకమును పెంచునవీ, లోకజ్ఞానమును, ధర్మ, అధర్మ వర్తనముల గూర్చి చర్చించునవీ అయి ఉంటాయి. ఇందుకు భిన్నములైన సంకీర్తనములన్నీ శృంగార కీర్తనలే అనుకోవడం కేవలం స్థూలదృష్టితో అనేమాట. శృంగార కీర్తనలు అనగానే నాయికా నాయకుల ప్రణయ గోష్ఠులా, విరహవిప్రలంభములా వర్ణనలే అనుకోవడంకూడా స్థూలదృష్టే !

భారతీయ భాషాసాహిత్యాలలో శృంగార రసవాహిని సంతతమూ సనాతనమూను ! దీనిలో అతి విస్తృతమైన అంతర్వాహిని మధురభక్తి రసతరంగిణి ! ఈ వెల్లువలో వెలువడినవే ఆళ్వారులూ, జయదేవాది కృష్ణభక్తియోగులూ, శివభక్తియోగులూ సంకీర్తన తరంగాలు ! వీటిలో పరమేశ్వరుడే నాయకుడు, అయనకు నాయికలు ఒకరా, యిద్దరా, పలువురా ! జీవాత్మలందరూ నాయికాస్థానీయులే ! పరమేశ్వరుడొక్కడే సచ్చిదానంద రూపుడూ సంపూర్ణుడూ అయిన పురుషోత్తముడు. జీవాత్మలందరూ స్త్రీమూర్తులైన నాయికలే. అన్నమాచార్యుల శృంగార కీర్తనలలోకూడా అంతే ! ఆయన తానే జీవాత్మయైన ఒక్కొక్క నాయికగానూ మారి, నాయకుడైన స్వామితో తన వలపులను, పొలయలుకలను, సవతులపై మాత్సర్యమును ఆ కీర్తనలలో వర్ణిస్తారు :

సాళంగ నాట

సంతోషించితిమి నిన్ను చల్లగా పెండ్లాడితివి
ఇంతటివాడావైతివి ఏమనేము నిన్నును !! -

వొరపైన జాణందవు, వొక్కడవే యింతటికీ, గురిసీ వలపులైతే కోటానకోటి !
పరపుపై చూచితేను పదారువేల దేవేళ్ళు, యెరగము నీ మహిమ యేమనేము నిన్నును !!

అగుదువో నీవె చెంచెతవు, అగుదువో నీవె గోపికవు
అలుమేలు మంగవే అగుదువో ! అగుదువో పదునారువేల దేవేర్లు ?
ఈసో, మోహమొ, ప్రణయకలహమో
ఎడబాటో, బ్రతిమాలుటో, కలయికో
అన్నిటను నాయకుండంతర్యామియో
వేంకటేశుడె, వేదవేద్యుడౌ హరియే ! (రజని)

అయినప్పుడు శృంగార కీర్తనలలో అడుగడుగునా ఆధ్యాత్మికత ధ్వనించడం అపరూపం కాదు. వినండి యీ నాయికా వర్ణన గీతం.

ముఖారి - ఖండగీతి

ఇదిగాక సౌభాగ్య మిదిగాక తపము, మరి
యిదిగాక వైభవం బిక నొకటి కలదో ॥

అతిప జన్మము సఫలమై పరమయోగివలె
ఇతర మోహాపేక్ష లిన్నియును విడిచె !
సతికోరికలు మహాశాంతమై యిదె చూడ
సతత విజ్ఞాన వాసనవోలె సుండె ॥ ॥ఇదిగాక॥

శ్రీ వేంకటేశ్వరుని చింతించి పరతత్వ
భావంబు నిజముగా బట్టె చెలియాత్మ.
దేవోత్తముని కృపాధనురాలై యిపుడు
లావణ్యవతికి ఉల్లంబు తిరమాయె ॥ఇదిగాక॥.

ఇందులో నాయకుడైన వేంకటేశ్వరునిపై మోహముతో, ఇతర మోహాపేక్షపట్ల నాయిక వైరాగ్యము చూపినదని వర్ణించడంలోను, సతి కోరికలు మహాశాంతమై ఆమె విజ్ఞానియైనట్లూ, దైవకృపక ధీనురాలైన ఆమె హృదయము స్థిరమైనట్లు వర్ణించడంలోను శృంగార కీర్తనలో ఆధ్యాత్మకతను - ధ్వని మాత్రంగాకాక వాచ్యంగా చొప్పించడం అన్నమయ్యవంటి మహాకవి రచనా శిల్పపు గొప్పతనమే ! ఇదొక టే

కాదు, అన్నమయ్యగారి శృంగార కీర్తన లెన్నింటిలోనో ఆధ్యాత్మిక భావాలు చాటుగానో ప్రత్యక్షముగానో చోటు చేసుకుంటూంటాయి !

ఆధ్యాత్మ సంకీర్తనలలో - తాళ్ళపాక సంపుటాలలో రెండవదానిలోనిది - ఈ కీర్తన వినండి -

కన్నడ గౌళ (ప్రాచీనం) -ఆది -

వెలికి వెళ్ళడు చలికి వెరవడు
ఉలికి ఉలికి ఉలికినయ్యా ॥

రోగియై తారుచుల బాయడు
భోగియై రతి పొందొల్లడు
వేగి మిగిలిన వెదచీకటి నీరు
తాగి తాగి తాగినయ్యా ॥

తొడికి తొడుకడు ఉడికి ఉడుకడు
కడికి కసరడు కడు చేరడు
మడికి గుడికి మానిన మమతల
వుడికి వుడికి వుడికినయ్యా ॥

నిండి నిండడు నెరసి నెరయడూ
పండి పండడు బయలీతలా
అందనె తిరువెంకటాధిపు తలపుచు
ఉండి ఉండి ఉండినయ్యా ॥

ఇది నాయకుని విరహగీతం కానేకాదు. నాయకుడు తిరువేంకటాధిపుడే ! ఈ పాటలో ఆయన కోసం విరహంతో తపిస్తుంది అన్నమయ్యే ! 'మడికి గుడికి మానిన మమతల ఉడికి ఉడికి ఉడికినయ్యా ! అనే మాటలను బట్టి, తన జీవిత కాలంలో అన్నమయ్య తన 'మడి' మొదలైన నిత్యకృత్యాల పట్లా, 'గుడి' అంటే స్వామివారి ఆలయం పట్లా తన మమతలు ఏ కారణం చేతనో తాత్కాలికంగా ఎవరి నిర్బంధం వల్లనో మానవలసివచ్చి, అందువల్ల తన పరితప్తావస్థను ఈ గేయంలో వర్ణించాడని మనకు తెలుస్తుంది.

భక్తి యోగులు వ్రాసే కీర్తనలలో-కొన్ని మానస బోధలవలె కనిపించేవి. అన్నీ స్వానుభవములను గురించే చెప్పినవి కానక్కరలేదు. లోకవృత్తాన్ని పరిశీలిస్తూ; లోకుల ప్రవర్తనను మార్చేటందుకు వ్రాసినవి చాలా ఉండొచ్చు, కొన్నిటిలో తనకుతానే హెచ్చరించుకొన్నవేమో - ఆత్మ చరిత్రలో అనుభవములేమో అనిపిస్తాయి.

## శుద్ధ వసంతం

(నిందామునగ దలచిన వారి వారి మనస్సుకు నిందెక్కడిది)

కదలుడిపి నీరాడగా దలచువారలకు
కదలేని మనసునకు కదమయెక్కడిది ?
దాహముడిగిన వెనుక తత్త్వమెరిగెదనన్న
దాహమేలుడుగు, తా తత్త్వమేమెరుగు ?
దేహంబుగల యన్ని దినములకును పదార్థ
మోహమేలుడుగు తాముదమేలకలుగు ?
ముంద రెగిరిన వెనుక మొదలు మరచెదనన్న
ముందరేమెరుగు తామొదలేల మరచు ?
అందముగ తిరువేంకటాద్రీశు మన్ననల
కందు వెరిగిన మేలు కలనైన లేదు ॥

ఈ 'కదలుడిపి' అనే కీర్తన అవాంఛనీయములైన విషయవాంఛలకు ముందు కొంచెం లొంగి, అదేదో దాని వలన అపకారమేదో తెలుసుకొన్న తర్వాత వదిలివేస్తాననే లోకుల స్వభావాన్ని విమర్శిస్తూ వ్రాసిన కీర్తన.

తన విషయ వాంఛలను గూర్చి హెచ్చరించేదే మరో కీర్తన.

## దేసాక్షి-ఖండగతి

వింతైన తొలగవై తేదైన నామదికి
వింత చవిసేతువుగా విషయబుద్ధి !
నెరచి కాంతలు నేను కినిసినను పొలయలుక
విరిచి కలుపుదువు కద విషయబుద్ధి !
తరితోడ వానివర్తన దలంచిననన్ను
వెరపు తెలుపుదువుగా విషయబుద్ధి !
ఎడలేని యాపదలనెట్లు పొరలిననన్ను
విడిచిపోవైతిగా విషయబుద్ధి !
సడిబెట్టి వేంకటస్వామి కృపచే నిన్ను
విడిపించ వలసెగా విషయబుద్ధి !

ఇంకొక కీర్తన-ఈ జగత్తులో హేయమైనదేదీ లేదంటాడు. ఈ భావనలో రామానుజుల గద్యంలో-'అఖిల హేయప్రత్య నీకు కల్యాణైకతాన' అనే సంబోధనలలో హేయములైన అఖిల వస్తువులకు ప్రత్యనీకము అయినవాడు భగవంతుడని రామానుజుల తత్త్వము। జగత్తంతా భగవద్రూపమే-అతని కంటే వేరైనదేదీ లేదు అనే భావన అద్వైత భావన; అన్నమాచార్యుల వారి కీర్తనలలో అద్వైత తత్త్వం అడుగడుగునా స్ఫురిస్తూంటుంది.

గుజ్జరి

హేయమైనదేదీ లేదు జగమింతారుచికరమే
మాయావికారమిది మదసెట్టు రోససును ?

కాయ ధారణలింపు, కాంతల భోగములింపు
ఆయతమై వారి వారి యాహారములింపు
సోయగపు గన్నులను చూచేటి వేడుకలింపు
చాయ మనసొడబడి సమ్మతించితేను ॥

తగిన జన్మములింపు తమచక్కదనాలింపు
జగతి వారికి వారి జాతులింపు
నిగిడి శ్రీ వేంకటేశ నీమహిమలే యివి
ఒగరులేక మనసొడబడి ఉంచేను ॥

ఈయనే బోధించే వైరాగ్యం జీవితంనుంచి దూరంగా తొలగిపోవు భేదికాదు. జగత్తులోను జీవితంలోను హేయమైనదేదీలేదు—అంతా రుచికరమే. మాయా వికారములు కూడా రుచికరంగానే ఉంటాయి. ఇవన్నీ శ్రీ వేంకటేశ్వరుని మహిమలే అనే భావనతో 'ఒగరులేక' మనస్సు ఒడబడిఉంచే అన్నీ ఇంపైనవిగానే కనబడతాయంటాడు. అయితే-మరొక కీర్తనలో జగత్తులో కనబడే ఇంపులలో తనని భ్రమింపజేసే నటనలుంటాయి! వాటివల్ల భ్రమయపద్దంటాడు. జగము మోహినీ గజము; మదించిన ఆడయేనుగు అంటాడు :

లలిత -

నటనల భ్రమయకు నా మనసా
ఘటియించు హరియె కలవాడు !

ముంచిన జగమిది మోహినీ గజము
పొంచినయాస పుట్టించేదిది !
వంచనల నిజమువలెనే యుండును
మంచులు మాయలు మరునాడు !!

సరి సంసారము సంతలకూటమి
సౌరిదిపచారము చూపేడిది
గరిమనెప్పుడు కల కలమనుచుండును
మరులగువిధమే మాపటికి !!

కందువదేహము కాని ముదియదిది
అందిన బహురూపమాదేవిది
యెందును శ్రీ వేంకటేశ్వరుడుండును
డిందుపడగ నిదె తెరమరుగు !!

నటనలు, వంచనలు. సంసారపు సంతలకూటమిలో ఆనాడే కామ, ఈనాడూ ఏనాడూకూడా ంసారికి మోహినీ గజంలాగా ఆస పుట్టించి, ఆట పట్టించి, మంచులా మాయమై పోవడమే పరిపాటి అని స్తుంది. అందులో మధ్యతరగతి సంసారి అంటే అన్నమయ్యగారికి ఎంత సానుభూతో చూడండి :

ఆ హి రి -

ఇట్టి సంసారి కేదియు లేదాయె
తట్టువడుటే కాని దరి చేరలేదు ॥

ములిగి భారపుమోపు మోచేటివాడు
అలసి దించుకొను నాడాడను—
అలరు సంసారికి ఆదియులేదాయె
తొలగని భారమెందును డించలేదు ॥

తడవి వేపచేదు త్రావెడివాడు
ఎడ యెడ తిను తీపేమైనను,
అడరు సంసారికి అదియులేదాయె
కడుచేదె కాని యెక్కడ తీపులేదు ॥

సంసారుల మనస్సును భ్రమయించే లోకపు మాయా నటనలనుంచి మళ్ళించి అందరకూ తండ్రీ, ౘకోనారాయణుడూ అయిన వేంకటేశ్వరునిపై భక్తి కలిగించడానికి - ఆయన కొన్ని వైరాగ్య తత్త్వాలలో ామర హృదయాలకుకూడా హత్తుకుపోయే జానుతెనుగు నుడికారాలతో ఎంతో బాగా కూరుస్తాడీ గేయాలను. ేసాళం అనే మధ్యయుగపు జానపద రాగంలో-ఒక తత్త్వం —

దే సా ళ ం — రూ ప క ం

ఇదిగో మాయజ్ఞానము - ఎప్పుడునూ సహజమే !
కదిసి నీవేమమ్ము కరుణించ వయ్యా ఇదిగో ॥

తల్లి చంకనున్నబిడ్డ, తమితోచన్ను తాగుతా
వొల్లందు తండ్రియెత్తుకొనబోతేనూ,
మల్లడిమాయలో మరిగిన జీవములము
మెల్లనె మీసేవజేసి మిమ్ము చేరజాలము ఇదిగో ॥

గీతాప్రవచనాలూ, ఉపనిషత్సూక్తులూ, వేదవాక్యాలూ, తెలుగువారి సొంత సామెతలూ కుప్ప తిప్పలుగా అన్నమయ్యగారి సంకీర్తనలలో విరివిగా చోటు చేసుకున్నాయి.

అనుక్షణమూ మన మేపని చేస్తున్నా అదంతా ఈశ్వరచర్యగా దృఢంగా భావిస్తూ చేస్తే, సత్సంకల్పచోదితమై ఆ భావనే నిత్య సాధనగా మనకు అభ్యాసనమవుతుంది. "అన్ని చేతలును బ్రహ్మార్పణ విధిచేయ అరిమిత్ర సమబుద్ధి, అనన్య భక్తియు, భరనధ్యాత్మజ్ఞాన తత్త్వము తెలియుట" — అనేదే అన్నమయ్యగారి ఆధ్యాత్మిక సందేశము.

"దైవమొక్కడే సంతత భజనీయుడు
భావము సమబుద్ధి పాయగతగదు !!
హరియే సకలాంతరాత్మకుడటు గాన
తిరమై యొకరి నిందింపదగదు" ఇదీ ఆయన సందేశమే!

ఇక స్వామివారి సాక్షాత్కార రమణీయాద్భుతమూర్తిని అన్నమయ్యగారు ఎన్ని కీర్తనలలో పాట పాటకూ కొత్త రమణీయతలను ద్యోతకంచేస్తూ ఎంత భక్తిభావోద్దీపకంగా కూర్చాడో ఒకటి రెండే మచ్చుకి వినండి. పాట పాటకీ పంక్తి పంక్తికీ వినేవారు చేతులు పైకెత్తి జోడించేటట్లు కూర్చాడు :

(వరాళి) "మొక్కుమొక్కు వాడెవాడె ముందరనే వున్నాడు
చిక్కుల చిరునగవుతో చిగిమోమదే !
పుక్కిటలోకములనే భుజకీర్తులునవే,
చక్కనమ్మ అలమేలు జవరాలదే :
చూడచూడ మాణిక్యాలు చుక్కలవలెనున్నవి
ఈడులేని కన్నులవె ఇనచంద్రాలు !

భైరవి - రూపకం

సందడి సొమ్ములతోడి సాకార మిదె పీడె
యిందరు వర్ణించరె యీ రూపము ॥ సందడి ॥
చుక్కలతో ఆకాశము నూపై నిలువబోలు,
నిక్కి రత్నాల జలధి నీటుకాబోలు,

మిక్కిలి నానావర్ణ మేఘపంక్తి కాబోలు
ఇక్కడనే నిలుచున్నదీరూపము ॥ ॥సందడి॥

నించిన పంచవన్నెల నీలగిరి కాబోలు
అంచల సంధ్యాకాలమది కాబోలు,
చించకాతని సొరుగుల చీకటిది కాబోలు
ఎంచగ నలవికాదు యీ రూపము ॥సందడి॥

పున్నమయునమాసయు పోగై నిలువబోలు
ఉన్నతి యోగీంద్రుల యూహకాబోలు
పన్నిన బ్రహ్మాండాల ధరణిదికాబోలు
ఇన్నిట శ్రీ వేంకటేశు యీ రూపము ॥సందడి॥

# హరినామ సంకీర్తనము - వాగ్గేయ కారులకు మార్గదర్శి అన్నమయ్య

—మండపాక ఉమాదేవి, బి. ఏ.,
వీణ, గాత్రము, డిప్లొమా.

హరియవతారములె అఖిల దేవతలు
హరిలోనివే బ్రహ్మాండంబులు
హరి నామములే అన్ని మంత్రములు
హరి హరి హరి హరి హరి యన వోమనసా.
భావములోన బాహ్యమునందున
గోవింద గోవిందాయని కొలువవోమనసా.

భారత జాతీయ జీవనములో ప్రతి విషయములోను దైవపరమైన విషయం ప్రతిబింబిస్తుంది. అదే ఈ జాతి యొక్క ప్రత్యేకత. అటువంటి దైవమునకు మనం ఎన్నో రూపములు సృష్టించుకున్నాం. అయితే ఈ దైవారాధన రెండు రకములుగా మన పెద్దలు నిర్ణయించేరు. అందు ఒకటి నిర్గుణారాధన. రెండవది సగుణారాధన. నిర్గుణారాధన యందు మనసు నిలచుట కష్టం. కనుక రెండవదైనట్టి సగుణారాధన చేసి అనేక మంది మహనీయులు మార్గదర్శకులైనారు. కవులు, గాయకులు. తత్త్వవేత్తలు, మత ప్రచారకులు, ఉపన్యాసకులు, వాగ్గేయకారులు యిట్లు ఎందరో మహానుభావులు తమ తమ ధీశక్తి వలన అనాది నుండి యీ నాటివరకూ భగవంతుని కీర్తిస్తూ తాము తరిస్తూ యితరులను తరించేటట్లు మార్గమేర్పరిచారు. భాషావేత్తలు, పండితులు, మత ప్రచారకులు ఎన్నుకున్న ప్రబోధనా సరళి కన్నా పామర పాటవ జానపద జనులకు వాగ్గేయ కారులందించిన సంకీర్తనా సరళి సులభతరముగ సుబోధకమైన అందుబాటులోకి వచ్చింది. గుణాతీతము, నిర్వికారము, నిరంజనము అయినటువంటి భగవత్స్వరూపాన్ని ఏ విధంగా దర్శించగలం? దాన్ని పామర హృదయం ఎలాగ అర్థం చేసుకోగలదు. అందుకు మార్గమేది? అదే పరబ్రహ్మ స్వరూపానికి ఒక రూప మేర్పరిచి భక్తిమార్గమునాశ్రయిస్తేగాని జ్ఞానోదయముగాదు. భక్తిజ్ఞానపరిపక్వత వలనగాని వైరాగ్యమేర్పడదు. వైరాగ్యమేర్పడినప్పుడే భగవత్స్వరూపమును తెలుసుకునే అవకాశం ఏర్పడుతుంది. అందువలననే భక్తి మార్గమే సన్మార్గ మన్నారు. "సంగీతజ్ఞానము భక్తివినా సన్మార్గము కలదే మనసా. ఆ సంకీర్తనా సరళే వాగ్గేయకారులకు శరణ్యము. అదే మనకూ శరణ్యము.

అర్చత ప్రార్చత ప్రియమేధసో అర్చత
అర్చంతు పుత్రకా ఉత పురం న దృష్ణర్చత.

పాడుడు పాడుడు. మీ పాటలను పాడుడు. ఓ ప్రియ మేధసా పాడుము. బాలబాలికలు గూడ గానము చేయుడు. భగవంతుని కీర్తింపుడు. వీణారవములు ప్రతిధ్వనించుగాక. యిది ఋగ్వేదము పలికిన మంత్రము.

భగవత్సాక్షాత్కారము ప్రబోధించే భక్తిమార్గము సంకీర్తనా సరళి. అటువంటి హరి సంకీర్తనా సరళిని క్రమబద్ధం చేసి రాగతాళములతో భక్తిభావమును మేళవించి గాయకులకేగాక శ్రోతలకు కూడ భక్తితన్మయత కలుగజేయుట యందు పదకవితా పితామహుడు అన్నమాచార్యుడే ప్రథముడు. అన్నమాచార్య సంకీర్తన చేయుచోట భూతప్రేత పిశాచములు వుండవని లోకోక్తి. అన్నమాచార్య కీర్తనలు 32 వేలుపైగా నున్నవని చరిత్ర కారులు పేర్కొన్నారు. సంపూర్ణ భక్తిభావముతో ఈ విధమైన రచనలు చేసినట్టి అన్నమయ్య చరిత్ర ఎంత ఉజ్వలమోగదా : అన్నమయ్య పదునాలుగవ శతాబ్దపు ఉత్తరార్థమునందున్న వ్యక్తి అతనికి ముందు పన్నెండవ శతాబ్దములో భక్తజయదేవుడు, పదమూడవశతాబ్దములో లీలాశుకులు ప్రసిద్ధిచెందినట్టి వారు. జయదేవుడు సంస్కృత భాషలో తన రచనలు గావించేడు. అవే ప్రసిద్ధి చెందినట్టి అష్టపదులు. భక్తిశృంగార మిళితములై శ్రీకృష్ణపరమై అమృతగుళికలై ప్రసిద్ధిచెందాయి. అటు తరువాత లీలాశుకుడు పదమూడవ శతాబ్దమునందు సంస్కృత భాషలోనే కృష్ణకర్ణామృత రచన ద్వారా గేయ రచనకు నాంది పలికాడు. యీతని శ్లోకములు ఆదితాళమునకు సరిపడే గేయమువలె సాగుతుందిరచన.

అంగనా మంగనా
మంతదే మాధవో
మాధవం మాధవం
చాంతరేణాం గనా

యిట్లు రచించాడు. యితని రచనలతో ప్రసిద్ధిగాంచి ప్రతి వారికీ తెలిసే రచన

కస్తూరీ తిలకం లలాట ఫలకే........

పిమ్మట తరువాత వాడు అన్నమాచార్యులు అన్నమాచార్యుల సమకాలికుడు పురందరదాసు. వారి తరువాత రామదాసు, క్షేత్రయ్య, నారాయణ తీర్థులు, త్యాగరాజు దీక్షితులు, శ్యామశాస్త్రి, స్వాతీతిరునాళ్ మొదలైనవారు. కర్ణాటక సంగీత పితామహుడనే బిరుదందిన పురందరదాసు కన్నడభాషలో అనేక రచనలు చేశాడు. ఆంధ్ర భాషకు అన్నమయ్య ఎంతో కన్నడ భాషకు పురందరదాసు అంత. మాయామాళవగౌళరాగము నందు సరిగమలు, జంటస్వరములు, మలహరి రాగమునందు రచించినట్టి పిళ్లారి గీతములు సంగీత విద్యార్థులకు ఈ నాటికీ ప్రథమ సోపానములై విరాజిల్లుతున్నవి వేదాంతము స్వానుభవము యితని గీతములలో ప్రతిబింబిస్తుంది. అలాగే రసాంగనిరూపణము, రాగవైవిధ్య ప్రయోగజ్ఞానము వ్యక్తమవుతుంది బహుళ ప్రచారము పొందినట్టి క్షేత్రయ్య పదాలలో. యితని సమకాలికుడే కంచర్ల గోపన్న అనే నామధేయం కలిగిన భద్రాచల రామదాసు. కేవలము భక్తిసంకీర్తనమే ప్రధానముగ రచన సాగించాడు భజనగీతముల పద్ధతిలో రామదాసు. అలాగే శివనారాయణ తీర్థులు పరతత్వబోధకము, ఆధ్యాత్మిక వివరణము ప్రధానముగా మహాయక్షగానములు రచించినట్టి భక్తాగ్రేసరుడు. బాలగోపాలతరంగం, కృష్ణంకలయ సఖీసుందరం ఆబాలగోపాలం స్మరించే తరంగములు. తరువాత పదిహేడు వందల నుంచి పద్దెనిమిది వందల వరకు కర్ణాటక సంగీత స్వర్ణయుగమునకు కారకులైన ధాతుమాతు కల్పనా దక్షులైన త్యాగరాజు, ముత్తుస్వామి దీక్షితులు, శ్యామశాస్త్రిలు సంగీత త్రిమూర్తులు.

అన్నమాచార్యులకు ముందు వారి రచనలు సంస్కృత భూయిష్టము. ఆంధ్రభాషలో పదకవితకు ప్రారంభముపలికి 'ఆంధ్ర కవితాపితామహుడు' అల్లసాని పెద్దనవలె 'పదకవితా పితామహుడ'నే బిరుదము పొందినట్టి ఘనత అన్నమయ్యది. ఇరువురూ నందవరీక బ్రాహ్మణులే.

యితడు అద్వితీయ ప్రతిభాశాలి. ఋషికల్పుడు. భక్తాగ్రేసరుడు. అయినందువలననే అనంత రూపాలలో తన పదముయొక్క ప్రదర్శన చూపించాడు. జాజరలు, చందమామలు, కోవెలలు, చిలుక, తుమ్మెదపదాలు, లాలి, సువ్వి, తందాన, జోల, జేజే, జయజయ, శోభన, మంగళ, వైభోగములు, మేలు

కొలుపులు, నలుగులు, దంపుళ్ళు, కూగూగులు, గుజ్జనగూళ్ళు, సివాళులు, ఆరతులు, జయమంగళాలు, అల్లో నేరేళ్ళు, ఛాంగుభళాలు, సొసముఖాలు, అవధానములు, వెన్నెలలు ఇత్యాది పదకవిత్వ విశ్వరూప ప్రదర్శనలో అనంతుడైన వేంకటేశ్వరుని అవలంబనగ రచనకు రూపాన్ని దిద్దాడు. అందుకే యితని తరువాత తరం వారికి, వాగ్గేయకారులకు ధాతుమాతు కల్పనాదక్షులకు ఇతడు మార్గదర్శి.

అదివో అల్లదిహో శ్రీ హరివాసము
...బంగారు శిఖరాల బహుబ్రహ్మమయము.
ఇది అన్నమాచార్యుల రచన.

యిదేవిధంగా భద్రాచల రామదాసు రచన....

అదుగో భద్రాద్రి గౌతమి యిదుగో చూడండి.
...
చారుస్వర్ణ ప్రాకార గోపుర ద్వారములతో.
........

అలాగే ఈ భవరోగములు పోగోట్టుటకు సద్భక్తినిచ్చి ముక్తిమార్గ మందుటకు చెదనిమందు శ్రీహరి పాద తీర్థమే అని నొక్కి వక్కాణించాడు అన్నమయ్య.

శ్రీహరి పాద తీర్థమే చెదనిమందు
మోహపాశముద్రోసి మోక్షమిచ్చేమందు.

యిదేతీరున సాగుతుంది రామదాసు రచన.

రామజోగి మందు కొనరే పామరులార
........
కాటుక కొండలవంటి కర్మములెడ బాపేమందు
సాటిలేని జగమునందు స్వామిరామజోగిమందు॥

విశ్వవ్యాపితుడైనట్టి భగవంతునికి సాకారమేర్పరచి అతనిని భక్తితో కొలువమన్నారు మహనీయులు. మూర్తిమంతమైనా భగవత్ స్వరూపము తన పాదాలతో త్రిజగములను ఆక్రమించుకున్నది అందుకే త్రిజగజ్జీవిత జీవన దివ్యవిధానం, భగవంతుని పాదములను వినమ్రుడై ఆశ్రయించుటే. తల్లి, తండ్రి, గురువు, దైవము అన్నారు పెద్దలు. చిరుత ప్రాయమునందు తల్లి, ఉపనయనమునాడు తండ్రి, ఉపదేశమున గురుపాదాలు పూజనీయము. దైవపాదములు సర్వవేళల ఆధారనీయము. అందుకే అంటాడు పదకవితా పితామహుడు సంకీర్తనాచార్యుడయిన తాళ్ళపాక అన్నమయ్య.

బ్రహ్మ కడిగిన పాదము
బ్రహ్మముతానెనీ పాదము
కామిని పాపము కడిగిన పాదము పాము తలనిడిన పాదము.
పరమయోగులకు పరిపరివిధముల
పరమొసగిన నీపాదము.
.........

బ్రహ్మ ప్రతిదినము అర్ధరాత్రియందు వచ్చి ఆ వేంకటేశ్వరుని పాదములను కడిగి పూజించి వెడతాడని చెపుతారు.

మహావాగ్గేయకారుడూ పరమ రామభక్తాగ్రేసరుడైనటువంటి త్యాగరాజు రచనలో భావమంతే. ఇదే విధంగా సాగుతుంది.

శ్రీరామపాదమా నీకృపజాలునే
చిత్తానికి రావే.
వారిజసంభవ సనకసనందన
వాసవాది నారదాదులెల్ల పూజించే
దారినీ శిలయై తాపముతాళక
వారము కన్నీరును రాల్చగ
శూర ! అహల్యను జూచి బ్రోచితివి
యారీతి బ్రోవవె త్యాగరాజగేయమ.

రామదాసు రచన కూడా యించుమించు యిదేతీరున నడుస్తుంది.

చరణములే నమ్మితి నీ దివ్య చరణములే నమ్మితి
వనములో రాతిని వనితగ జేసిన
చరణం చరణం చరణం నీ దివ్య ॥చ॥

వారధి దాటిన వర భద్రాచల
వరదా వరదా వరదా నీ దివ్య
చరణములేనమ్మితి శ్రీరామచరణములే నమ్మితి

అన్నమాచార్య విధానంలో అతను రచించినట్టి వివిధ రీతులలో త్యాగరాజు కూడా రచించాడు. కళ్యాణం పాటలు, మేలుకొలుపులు, ఉత్సవ సాంప్రదాయ కీర్తనలు దివ్యనామ సంకీర్తనలు. నలుగుపాటలు, లాలి పాటలు,

శోభానే పాటలు : సీతాకళ్యాణ వైభోగమే
రామకళ్యాణ వైభోగమే

* * *

ఉయ్యాల లూగవయ్యా రామయ్య.

* * *

నాపాలి శ్రీరామ భూపాలకసోమ.
......నళినాలోచన నీకు నలుగుబెట్టెదరార.

* * *

లాలీ లాలీయని యూచేర వనమాలీ మాలిమితో జూచేర.

* * *

శోభానే పాటలు : వదన ద్యుతిజిత సోమ
వసుధా మానసకామ
మద మానవ గణభీమ
మాంపాహి శ్రీరామ శోభానే.

* * *

మేలుకొలుపు : మేలుకో దయానిధే
మేలుకో దాశరధే
మేలుకో దయానిధే
మిత్రోదయమీ వేళ.

* * *

యీ విధంగా అన్నమాచార్యుల రచనల తీరు త్యాగరాజును కూడా మార్గదర్శకం అయింది. పురందరదాసు అన్నమాచార్యుల రచనల పోకడకూడా ఒకే విధంగా వుంటుంది. పురందరదాసు సంకీర్తనలు అన్నమాచార్యుల సంకీర్తనలకు ఛాయానుకారులుగా కనిపిస్తాయి.

మాళవిరాగం : అన్నమాచార్యుల భజన పద్ధతి సంకీర్తన.
శరణు శరణు సురేంద్ర సన్నుత
శరణు శ్రీపతి వల్లభా
శరణు రాక్షస గర్వసంహార
శరణు వేంకట నాయకా.

అదే విధమయిన పురందరదాసు భజన సంకీర్తన.
శరణు శరణు సురేంద్ర వందిత
శరణు శ్రీపతి సేవిత
శరణు పార్వతి తనయ మారుతి
శరణు సిద్ధి వినాయక.

ఇరువురూ సమకాలీనులేకదా. అందుకే ఆ ఛాయలు.

ఆళ్వారులు రచించిన ద్రావిడవేదమనీ పంచమాగమమనీ పిలువబడే నాలాయిరం నాలుగువేల సంకీర్తనలు కలది. అన్నమాచార్యుడొక్కడే రచించిన ఆంధ్రవేదము ముప్పదిరెండువేల సంకీర్తనలు గలది. ఇవి కూడా ద్రావిడ ప్రబంధములలో వలెనే భక్తునకు పరమేశ్వరునకు నాయికా నాయక భావము, పతి పత్నీ భావము కల్పితమై ఉజ్వల రసానుభూతి కలిగించుచు, అనేక దేవాలయములలోని అర్చామూర్తుల అభివర్ణించుచు, శరణాగతి మహాత్మ్యమును ప్రతిపాదించుచు, అనేక విధముల లోకనీతి, ధర్మబోధ, భూతదయాది, సదంశముల వెలార్చుచు, వేడుకగా సంగీత సారస్యముతో సరళ భాషతో వేదవేదాంతేతిహాసాది సూక్తి తదర్థ ప్రతిపాదనములతో వెల్లివిరిసి విజ్ఞాన నిధులై విరాజిల్లు చున్నవి. అందుకే అతను అందరికీ ఆరాధ్యుడై మార్గదర్శియై యున్నాడు. అతని సూక్తులలో ఉదాహరణకు కొన్ని.

సంచిత కర్మ భారముతో జీవన ప్రస్థానములో అడుగు తీసి అడుగు వేయలేని మానవునకు అభయము కావాలి. ధైర్యాన్ని ఆత్మస్థైర్యాన్ని యిచ్చే ఒక ఆశ్రయం కావాలి. అప్పుడే అతడు పురోగమించి తోటి మానవుల హితానికి దేశ పురోభివృద్ధికి కృషి చేయ గలుగుతాడు. అటువంటి భావస్ఫూర్తిని కలుగజేసేదే శ్రీ వేంకటేశ్వర అభయహస్తము. అజ్ఞానము పెరిగి జ్ఞానశూన్యతతో ఉన్నప్పుడు ప్రజ్ఞానాన్ని వెలికి తీసి అందించగలిగే హస్తము కావాలి. రాక్షస ప్రవృత్తి పెరిగి ఐకమత్యత నశించి హింస విజృంభించే సమయములో ప్రేమ, దయ, జాలి, కరుణ ఇత్యాది భావాలను మనిషిలో కలిగించి మానవ కళ్యాణమునకు తోడ్పడే హస్తమే కావాలి. యంత్రస్థగిత పాదస్థానమునుండి మణిపూరమునందు ప్రకాశించే అభయహస్త ప్రాశస్త్యాన్ని వర్ణిస్తూ :

ఇందరికీ అభయమ్ములిచ్చు చేయి
కందువగు మంచి బంగారు చేయి
వెలలేని వేదములు వెదకి తెచ్చిన చేయి
చిలుగు బుగ్గల క్రింద చేర్చుచేయి
కలికియగు భూకాంత కౌగిలించిన చేయి
వలమైన కొనగోళ్ళవాడి చేయి.

భగవంతుని దృష్టిలో మానవులందరూ సమానులే. కలిమిలేములు లేవు. కులభేదములు లేవు. మతభేదములు లేవు యివేవీ ఆ భగవంతుని చేరడానికి అడ్డురావు. అటువంటప్పుడు మనం కులమత రాజకీయ భేదాలతో ఒకరితో ఒకరు కలహించుకోవటం, కక్షలు కార్పణ్యాలు పెంచుకోవటమెందుకు? అందరూ కలసి మెలసి వుంటేనే క్షేమం. అదే దేశ సంక్షేమం. మనమంతా ఒక జాతి. మనదంతా ఒకే దేశం మనదంతా ఒకే కులం. అదే మానవకులం. ఆసేతు హిమాచల ఆపూర్వ పశ్చిమార్ణవ పరివ్యాప్త విశాల యావద్భారత జీవుల అంతరాత్మలో ఆ శ్రీహరి ఒక్కడే. గంగా గోదావరి సహ్యజా తుంగతరంగాల నడుమ, వింధ్య హిమవత్ శ్రీ నీలాద్రుల నడుమ జీవనం సాగించే ఈ భారతీయ జనమంతా ఒక్కటే. భాషలు వేరయినా మన అందరి భావం ఒక్కటే. మతాలు వేరయినా మన అందరి మనసులూ ఒకటే. ప్రదేశాలు వేరయినా మన అందరి జీవన విధానం ఒకటే. నువ్వూ నేనూ కలిస్తేనే మనం. మనం మనం కలిస్తేనే జనం. అదే అందరికీ ప్రయోజనం యీ ప్రయోజనాన్నే విశ్లేషిస్తూ

కందువగు భేదంబులు యిందులేవూ ఒకే
అందరికి శ్రీహరే అంతరాత్మ ఒకే
మెండైన బ్రాహ్మణుండు మెట్టు భూమియొకటె
చండాలుడుండేటి సరిభూమి యొకటే
తందనాన ఆహి తందనాన భళా తందనాన.

పరుల పంచలో బ్రతికే మానవుల జీవితము కడు రోతగాక అతనికి అనుదినమునూ దుఃఖమయమే. పశువుగా, పక్షిగా, తుదకు అడవిలో చెట్టుగానయినా జీవింపవచ్చునుగాని పరదాస్యపు బ్రతుకు హీనాతిహీనము. కడలిలో అలలకు, జీవుని మనస్సునందుగల కోరికలకు అంతమేలేదు. అలలు నిలిచాక స్నానమాడుట మనసు నిలకడ పొందిన తరువాత భగవంతుని తత్త్వము తెలుసుకొనుట ఈ రెండును అసాధ్యములే. కనుక మనసును అదుపులో పెట్టుకొని దాస్యపు జీవనకై ప్రాధాన్యమీయక భగవద్ధ్యానమే పరమావధిగా పరమాత్మ స్వరూపమును తెలుసుకొన ప్రయత్నించినవాడే మహనీయుడు. పరమేశ్వరుని సంస్మరించి శాశ్వత సాయుజ్య పదవి నందిన జీవుడే జీవన్ముక్తుడు. పట్టెడు కూటికొరకు జానెడు కడుపుకై లంపటములలో తగిలి అవినీతి కార్యక్రమములలో పాలు పంచుకుంటూ దేశక్షేమమును విస్మరించి నరకమును పొందవలదని లౌకిక జీవిత పరమ రహస్యాన్ని తన మృదుమధుర సూక్తులతో విపులీకరిస్తూ చెపుతాడు :

మనుజుడై పుట్టి
మనుజుని సేవించి
అనుదినము దుఃఖ
మందనేల
జుట్టెడు కడుపుకై చొరనిచోట్ల జొచ్చి
పట్టెడు కూటికై బ్రతిమాలి.

పరమ భక్తాగ్రేసరుల భావనాసరళి పరమాత్మని లీలలు కీర్తించునాడు, వారి తాదాత్మత స్వరూపమునందు హరికీర్తనాసామ్యము విశిష్టగోచరము. భగవద్భక్తికి కల్పవృక్షమగు భాగవత కృతికర్త సహజ పండితామాత్యుడగు పోతనామాత్యుడు హరిసంకీర్తనాచార్య అన్నమాచార్యవర్యుని సమకాలికుడు. వారి కృష్ణలీలా సంకీర్తనములు ఒక భావనాసరళిలో సమకాలీన భక్తిపారవశ్యముతో సాగినవి. అందుకుదాహరణగా :-

అనరాదు వినరాదు అతని మాయలు నేడు – అన్నమాచార్యులు
ఓయమ్మ నీకుమారుడు మాయిండ్లను
పాలు పెరుగు మననీడమ్మా
పోయెద మెక్కడికైనను మాయన్నల సురభులాన మంజులవాణీ.
పోతనామాత్యుల భాగవతము.

అన్నమాచార్యుల అనరాదు వినరాదు కీర్తనలో చాలా చక్కని భావం. ఆ కృష్ణుని చిలిపిచేష్టలు చాలా రమణీయంగా రచించాడు అన్నమాచార్యులు. ఆడుకుంటున్న బాలుర దగ్గరకుపోయి వారి నోర్లు తెరువమన్నాడు. తెరవగానే ఆనోళ్ళయందు ఇంత దుమ్ముతీసి జల్లేశాడు. అదిచూచి బాలురంతా ఏడుస్తూ పోయి తమ తమ తల్లులతో చెప్పగా వారంతా యశోదమ్మపైకి దండెత్తివచ్చి యిట్లంటారు. అమ్మా! యశోదమ్మతల్లీ! నీకొడుకు పనులు చూచావా? మాపిల్లల నోట్లో దుమ్ముజల్లి పారిపోయాడు. యింక ఏమి చెయ్యాలమ్మా? అని దెబ్బలాటకు వస్తే ఆ యశోదమ్మ కృష్ణుణ్ణి పిలిచింది. ఏమిరా! కృష్ణా! యిటువంటి చెడగపు పనులు చేస్తావా! నిన్ను శిక్షించగలను సుమా: అనగా పోయి ఆ పిల్లల నోరు చూడండమ్మా. నేనేం చేయలేదు. అనగా వీరంతా వెళ్ళి చూడగా ఆ పిల్లల నోట్లో పోసిన ఇసుక పంచదారగా మారి కనిపించిందట. యిటువంటి చక్కని రచన ఈ సంకీర్తన.

* * *

అధికార రోగపూరిత రాజులు భక్తాగ్రేసరులైన గాయక కవులను ఆరడిబెట్టిన గాథలు పెక్కు గలవు అటువంటి గాథ :-

ఒకనాడు ఆనాటి ప్రభువైన సాళ్వ నరసింహరాయ భూపతి, అన్నమాచార్యులు ఆ స్వామి చెంత కూర్చుని గానం చేయుచుండగా వినుట జరిగింది. ఆ కీర్తన.

ఏమొకో చిగురుటధరమున
నెడ నెడ కస్తూరి నిండగా
భామిని విభునకు వ్రాసిన
పత్రిక కాదుగదా.

యీ కీర్తన విన్న ప్రభువు ఔన్నత్య గర్వముతో తనపైన తన దేవేరిపైని కీర్తన రచించి గానం చేయమని ఆదేశించాడు. అందుకు అన్నమయ్య మిక్కిలి నొచ్చుకుని యిట్లంటాడు.

తలగరో లోకులు
తలపకు రోమము
కరిగిన దిదె మాకాపురము
నరహరి కీర్తన నానిన జిహ్వా
పరులనుతింపగ నోపద జిహ్వా

అని నిరాకరించాడు.

అందుకు కోపగించిన మహారాజు మూరురాయరగండమనే శిక్ష అన్నమాచార్యునిపై ప్రయోగించి సంకెల వేయించి కారాగారములో నుంచగా అన్నమయ్య ఇట్లు గానం చేశాడు.

సంకెల బెట్టినవేళ
చంపబిలిచిన వేళ
అంకిలిగా నప్పులవారాగిన వేళ
వెంకటేశునామమే విడిపింపగతిగాక
మంకుబుద్ధి పొరలిన మరిలేదు తెరగు
ఆకటి వేళల అలపైన వేళలను
వేకువ హరినామమె దిక్కుమరిలేదు.

అని ఆ వేంకటేస్వరస్వామిని వేడుకుని శృంఖలావిముక్తి పొందెను. త్యాగరాజు సాహిత్యగుణం మాధుర్యం. శ్యామశాస్త్రిలది ప్రసాదగుణం. ముత్తుస్వామి దీక్షులది ఓజస్సు. సమానఘటితమైనశయ్యలో ఓజోగుణం వర్తిస్తుంది. అందులో నిర్మమకారం సర్వలక్షణ లక్షితంగా వర్ణనమై వుంటుంది. అన్నమయ్య రచనలలో ఈ త్రిగుణములూ ప్రతిబింబిస్తూ లలితమై సుద్యోతకం అవుతూ వుంటుంది. బ్రహ్మజ్ఞానం 'సోహం బ్రహ్మాస్మి' అనే తత్వాన్ని మంత్ర జ్యోతిషశాస్త్రపరంగా దీక్షితులవారి కృతులలో స్పష్టపడతాయి. అయితే అతనికి ఆద్యుడయిన అన్నమయ్య బాలాజీ అనే అస్వర్ధం నామధేయం కలిగి ఓం ఐం హ్రీం శ్రీం ఐం, క్లీం, సౌః బీజాక్షర సంపుటీ బాలాత్రిపురసుందరి వీరఉగ్ర నారసింహావతార స్వర్వాకర్ష, సమ్మోహ సర్వసౌభాగ్యదాయక శ్రీహరి అంశల మూర్తిస్వరూపమయిన శ్రీవేంకటేశ్వరస్వామిని ఆవలంబంగా తీసుకుంటాడు. సప్తగిరి నాధుడయి సప్తసంఖ్యాధి దేవత అయిన కేతు గ్రహము మోక్షకారకుడుగాన సప్తాక్షరమైన నిషాదం ప్రత్యేకంగా కలిగిన రాగలక్షణాలు మూర్తీభవించివుండే పదకవితా కీర్తనలు రచించి బీజాక్షర మననంవల్లపొందే ఆముష్మికసిద్ధిని తనకీర్తనలు గానంచేసుకునే పండిత పామర జనానికి సమానావకాశములను కలిగించాడు. మంత్రశాస్త్రపరంగా జ్యోతిషశాస్త్రపరంగా అన్నమయ్యను ఇంకా ఎంతో అర్థం చేసుకోవలసింది చాలావుంది.

మహావాగ్గేయకారుడు పదకవితా పితామహుడు అద్వితీయ ప్రతిభాశాలి హరికీర్తనా చార్యుడు పంచమాగమ సార్వభౌముడు, ద్రావిడ వేదాన్ని తెలుగుచేసిన వైష్ణవనిష్ఠాతుడు. భక్తిపారవశ్యముతో అమోఘ భావకల్పనా దక్షతతో పదకవితా ప్రక్రియ లస్పిటితో తన సంకీర్తనా విశిష్టతను ప్రకటిస్తూ 32 వేల సంకీర్తనలతో ఆ తిరుమలేశుని పాదపూజ చేసిన ధన్యుడు. మహత్తరమైన ఆత్మవిశ్వాసము, భక్తి తన్మయత, ఆత్మస్థయిర్యమును వెల్లడించుతూ.

దాచుకోనీపాదాలకు
తగనే జేసిన పూజలివి.
పూచినీ కీరితి రూపు
పుష్పములివియయ్యా
ఒక్కపదమేచాలు ఒద్దికయైమము రక్షింప
తక్కినవి భాండారాన దాగియుండనీ.

అని సంకీర్తిస్తూ శ్రీ తిరుమలేసుని పాదనీరాజన జ్యోతిలో ఐక్యమై భావితర వాగ్గేయ కారక గాయనీగాయకుల లోకానికి మార్గదర్శకుడై దివ్యజ్యోతిగా యీనాటికీ ఏనాటికీకూడా వెలుగులు వెదజల్లుతూ మార్గదర్శియై నిలచాడు. ఇటువంటి అన్నమయ్య సంకీర్తనలు ఎల్లవేళలా గానంచేసుకునే అదృష్టము అందరకూ కలుగ వలెనని ఆశిస్తూ ఆ మహనీయునకు మా నమోవాక శతసహస్రములు. ***

# అసలైన కళాకారుడు అన్నమయ్య
## ( 1408 - 1503 )

—శ్రీమతి శోభారాజు

ఆలోచనా పటిమగలిగి, భావనాచాతుర్యాన్ని అందంగా ఆవిష్కరించగల సామర్థ్యం ఏ కళాకారుడికైనా అవసరం. ఈ సామర్థ్యం ఎంత ఎక్కువగా వుంటుందో అంత గొప్పవాడనిపించు కుంటాడు కళాకారుడు. ఈ దృష్టితో పరిశీలిస్తే, మన తొలి తెలుగు వాగ్గేయకారుడైన అన్నమయ్యను మించిన కళాకారుడుండడేమో అనిపిస్తుంది. వేంకటేశ్వరుని పరంగా ముప్పైరెండువేల సంకీర్తనలను రచించి ఆ స్వామి పాదాలకే అంకితం చేసిన దివ్య కళాకారుడు తాళ్ళపాక అన్నమాచార్యుడు.

ప్రజాభిరుచికి తగినట్లుగా తన కళను మలచుకుంటాడు సామాన్య కళాకారుడు. తన స్వాతంత్ర ప్రతిపత్తినే ప్రజ లామోదించేలా చేయగలుగుతాడు విలక్షణమైన కళాకారుడు. విజయనగర రాజుల కాలంలో ప్రబంధ కావ్యాలకే తప్ప పద సాహిత్యానికి గుర్తింపులేదు. పదాలలోనే తన ప్రత్యేకతను చూపించి సారస్వత లోకంలో వినూతన స్థానాన్నలంకరించాడు. స్వర్గీయ శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మగారన్నట్లు, "అదొక సారస్వత క్షీరసముద్రం"

అన్నమయ్య సంకీర్తనలు - ఆధ్యాత్మములు, శృంగారములు అని రెండు విధాలు. అన్నమయ్య భావనా శిల్పం శృంగార సంకీర్తనలు పాడుకున్నపుడు సాక్షాత్తు శ్రీ మహావిష్ణువుగను, అధ్యాత్మ సంకీర్తనలలోని వైరాగ్య గీతాలు పాడుకున్నప్పుడు శంకరునిగను గోచరిస్తుంది భక్తి, నీతితత్త్వాలను చాటే యితని సంకీర్తనలను పరమ మంత్రాలుగా పేర్కొంటాడితని మనుమడు చిన్నన్న. ఇతడు జానపద ధోరణిలోను, అచ్చ తెలుగులోను, సంస్కృతములోనూ చేసిన రచనలేకాక మణి ప్రవాళ ప్రక్రియలో నడచిన రచనలుకూడా వున్నాయి. ఉపనిషత్తుల సారాన్నంతా తనకున్న బహుశాస్త్ర పరిజ్ఞానంతో తనదయిన ఓ విలక్షణ శైలిలో తన వారమైన మనందరికీ అందించి యిచ్చిన సందేశ రాశి- అన్నమయ్య పాటలు.

జీవనాయిక పరమాత్మతో ఐక్యం కావాలని పడే తపనను మధుర భక్తి సాంప్రదాయంలో మధురాతి మధురంగా అన్నమయ్య సాగించిన స్వతంత్ర రచన 'శృంగారమంజరి'. ఆధ్యాత్మ శిఖరాగ్రాన్నందుకున్న అతని శృంగార కళా హృదయానికి దర్పణమా ద్విపద.

అన్నమయ్య మిగిలిన విద్వాంసులలాగే రాజులకో, అధికారులకో, ధనవంతులకో అమ్ముడుబోయి వుంటే భోగభాగ్యాలతో తులతూగి ఉండవచ్చును. కాని అతని లక్ష్యం వేరు. అతని కళకు పరమార్థం వేరు.

తనకుగా తాను కోరుకున్నది పరమ'పదం'. లోకానికి చాటాలనుకున్నది వేంకటేశ్వర తత్త్వం. మానవులందరిలో మాధవుని చూడగలిగిన మహనీయుడు గనుకనే సమాజాన్ని ఉద్ధరించాలని ఎలుగెత్తి తత్త్వాలను పాడాడు.

"నిండార రాజు నిద్రించు నిద్రయు నొకటె అండనే బంటు నిద్ర అదియు నొకటె

మెండైన బ్రాహ్మణుడు మెట్టుభూమి యొకటె చండాలుడుండేటి సరి భూమి యొకటె"

బ్రాహ్మణుడైనా, చండాలుడైనా చివరికి కలిసేది ఒకే మట్టిలోనే అని కులభేదాలతో కుళ్ళిపోతున్న సమాజానికి మేలుకొలుపుగా పాడిన తందాన పదమది.

తన రచనాశైలినే అనుకరించి, స్వంత సామర్థ్యంగా ప్రగల్భాలు పలికిన సంకీర్తనచ్ఛాయాపహారులను అన్నమయ్య కటువుగా గర్హించాడు.

"ముడిచివేసిన పువ్వు ముడువ యోగ్యముకాదు.

కుడిచి వేసిన పుల్లె కుడువగా గాదు. బడి నొకరు చెప్పిన ప్రతి చెప్పబోతేను అడరి శ్రీహరి కది అరుహము గాదు"

తమదంటూ ఒక శైలిలేక, ఇతరుల ననుకరించి, స్వయంప్రతిభగా చాటుకునే దొంగ కళాకారుల కది అన్నమయ్య చూపుతున్న తర్జనం.

అన్నమయ్య జీవితంలో కళాకారులకు, కళాపోషకులకు కనువిప్పు కలిగించే రసవత్తరమైన ఘట్టం ఒకటుంది.

"సురలకు నరులకు సొరిది విన విన అరుదు తాళ్ళపాక అన్నమయ్య పదములు"

అన్నమయ్య పాటలు వినాలన్న, కుతూహలంతో పెనుగొండ ప్రభువు సాళువ నరసింగరాయలు అన్నమయ్యను సాదరముగా తన ఆస్థానానికి రావించాడు. తన జీవితాశయమయిన వేంకటేశ్వర తత్త్వ వ్యాప్తికి రాజాశ్రయం కొంత ఉపకరిస్తుందనుకొన్నా డన్నమయ్య. అందుకే నరసింగరాయని ఆహ్వానాన్ని మన్నించాడు.

కవి పండిత గాయకాది విద్వన్మణులు రాశి పోసినట్లుగా వుండే రాయల ఆస్థానం రాయల రసికత రాసికెక్కినదే గదా! "తమ గానామృతము గ్రోలుట కువ్విళ్ళూరుచున్నా"మని అన్నమయ్యను వేడుకొన్నాడు రాయలు. నిరతమూ నారాయణ నామ గానమే నర్తించే నాలుక అన్నమయ్యది. దండెళ్ళతులు కూర్చుకొని, అరమోడ్పు కనులతో అన్నమయ్య పాటకు సిద్ధమయ్యాడు అతని మనో నయనాలలో అలమేల్మంగా శ్రీనివాసుల దివ్య శృంగార లీలాహేల కదలాడింది. పరవశంగా పాటనందుకున్నా డన్నమయ్య.

"ఏమొకో చిగురుటధరమున ఎడనెడ కస్తూరి నిండెను

భామిని విభునకు వ్రాసిన పత్రిక కాదుకదా.....!"

....తెగని పరిణతులతో తెల్లవారినదాకా జగదేక పతితో అలసి, తన కేళికా మందిరం నుండి నాయిక వచ్చింది. నాయిక మేనిపైన శ్రీనివాసునితో తాను నెరపిన సంభోగపు చిహ్నాలి కా వున్నాయి. చెలులది గమనించారు. నాయిక నాటపట్టిస్తున్నారు.

"అమె చిగురుటధరాన కస్తూరి నిండి ఉంది.

ఎందువలననో?" - ప్రశ్నించిందో చెలికత్తె

భామిని విభునకు వ్రాసిన పత్రిక కాదుకదా ? "– మరొకతె

"ఈ చకోరాక్షికి కందికొనలు ఎరుపెక్కివున్న కారణం ఊహించగలరటే ?"

"తన ప్రాణేశ్వరుని మీద గట్టిగా నాటిన చూపుల తూపులను ఒక్కసారిగా వెనక్కు లాగిన మూలాన (బహుశా నాయకుడు నాయికను చూడగా, సిగ్గుతో చేసిన అసంకల్పిత చర్య) అంటిన నెత్తురు కాదుకదా ?"

"పడతి కుచోన్నతి శోభలు పయ్యెద వెలుపల వరకు వ్యాపించాయి. కనుగొన్నారటే ?"

"తీరని మోహావేశంతో ప్రియుడు గోళ్ళతో ఒత్తిఉంటాడు. ఆ చంద్రరేఖలకు కాసిన వేసవి కాలపు వెన్నెల కాదుకదా ?"

"చెలి చెక్కిళ్ళపై ముత్యాల జల్లులేర్పడ్డాయి. అదేమిటో ఊహించగలరటే ?"

"వేంకటపతి కామినివదనాన అంటించిన సురతపు చెమటల అందం కాదుకదా ?" కాదుకదా అంటూనే బౌనసిపించే సమాధానాలు చెప్పుకున్నారు చెలులు.

అన్నమయ్య పాడిన పాటలోని అందమైన భావం అది. సభ అంతా మైమరచిపోయింది. పర వశమందిన రాజు పదేపదే అదే పాటను పాడించుకొని రసడోలలూగాడు. రాజు రసికత తనివినొందలేదు. అన్నమయ్య ఆలపించింది పవిత్రమైన అలమేల్మంగా శ్రీనివాసుల దివ్య ప్రణయమని మరచాడు. అది జీవాత్మ పరమాత్మల ఐక్యానంతరోల్లాసాన్ని పరమ భాగవతుడు చమత్కారంగా పాడుకున్నాడని రాజు గమ నింపుకు రాలేదు. పాటలోని బాహ్య శృంగారభావమే అతనినాకట్టుకొంది. మనసు కామపూరితమైంది. లోభం కలిగింది.

"ఇలాటి పాటే నామీద పాడమ"ని విలాసంగా అడిగాడు రాజు.

"హరి హరీ !" అని చెవులు మూసుకున్నాడన్నమయ్య. "హరిముకుందుని కొనియాడు నా జిహ్వ నిను కొనియాడగ నేరద"ని తిరస్కరించాడు

రాజు అహం దెబ్బతిన్నది. "నాయాజ్ఞకు తిరస్కారమా ?" అని అన్నమయ్యకు మూరురాయర గండమని పేరుగల సంకెల వేయించి చెరసాలలో తోయించాడు. రాజు తలచుకుంటే దేనికికొదువ? అన్న మయ్యకు వేంకటేశ్వరుడే గతి. దీనదీనంగా స్వామిని వేడుకున్నాడు.

"సంకెల బెట్టిన వేళ చంప బిలిచిన వేళ అంకిలిగా అప్పుల వారాగిన వేళ వేంకటేశు నామమే విడిపించ గతి గాక మంకుబుద్ధి పొరలిన మరిలేదు తెరగు" సంకెల తెగి నేలబడ్డది. రాజు అహంకారపు పొరలు తెగిపోయాయి. ఇంతటి భాగవతోత్తముడినా తానవమానించింది? అని పశ్చాత్తాపం కలిగింది. క్షమించమని రాజు అన్నమయ్య పాదాలపడ్డాడు. సకల భోగాలు కల్పించి గౌరవంగా చూసుకుంటానని, తన కొలువుననే ఉండి తనని మన్నించమని రాజు వేడుకున్నాతు.

"ఈ భోగభాగ్యాలు లక్ష్మీ కటాక్షాన కదా కలుగుతాయి? ఆమె భర్త శ్రీనివాసునే కొలిచేవారము మేము. మాకీ సిరులు ఒరులీయ పనిలేదు. పుట్టు భోగులము మేము హరి దాసులము".

అది అన్నమయ్య సమాధానం. ఎంతటి ఆత్మ ప్రత్యయం అన్నమయ్యది! ఎంతటి త్యాగనిరతి! కాసులకు కళనమ్ముకునే కళాకారులంతా తామున్న (దు) స్థితికి కంట తడిపెట్టక తీరదేమో!

నాటి అష్టదిగ్గజాలని పేరు గాంచిన రాయల ఆస్థాన కవులు తమ సాహితీ సరస్వతిని రాయల ఆస్థానానికి అలంకారంగా సమర్పించి సుఖ జీవనం గడిపారు. వారి పాండిత్యాన్ని ప్రశంసించాము. గండె పెండేరాలు తొడిగాం.

అన్నమయ్య తన సంకీర్తనాకుసుమాలతో వేంకటేశ్వరుని పాదాల నలంకరించాడు. వాటి నెన్నటికీ వాడనిపూలుగా స్వామి తన ఆలయాననే సంకీర్తనాభాండారంలో పదిల పరచు కున్నాడు. అందుకే అయిదువందల సంవత్సరాలు ఆలస్యమైనా అన్నమయ్యను స్తుతిస్తున్నాము. తిరుపతి పురవీధుల్లో ఏటేటా ఏనుగుల మీద వేంకటేశ్వరునితో సమానంగా ఊరేగిస్తున్నాము. పూజిస్తున్నాము.

"హరి యవతారమీతడు అన్నమయ్య
అరయమాగురుడితడు అన్నమయ్య".

# అన్నమాచార్యుల మధురభక్తి

బహుభాషా కోవిద
సాహిత్యవేదాంత ప్రవచన పారీణ
—యల్లంరాజు శ్రీనివాసరావు, M.A.
Retd. Prof.

జయదేవుడు, లీలాశుకుడు, - అన్నమయ్య - క్షేత్రయ్య - వీరందరూ ఒక కోవకు చెందిన వారు ఎంతటి మహాభక్తులో అంతటి గొప్ప రసికులు వీరు. 'రసిక' అనే మాట చెవిని పడగానే చాలా మంది మనసులో బెదరిపోతారు. ఎంతో అశ్లీలమైన మాట విన్నట్టుగా ఈసడించుకొంటారు. కాని ఇందులో అసహ్యించుకోవలసిన అర్థమేదీ కానరాదు. భక్తిప్రధానమైన భాగవతంలాంటి గ్రంథంలోనే 'పిబత భాగవతమ్ రసమాలయమ్ - ముహురహోరసికా భువిభావుకాః' అని ప్రయోగించాడు వ్యాసభట్టారకుడు. రసలోలుపత్వమున్న భాగవతుడెవడో వాడూ రసికుడంటే.

భగవత్తత్త్వాన్ని చేరటానికి నాలుగే నాలుగు మార్గాలు నిర్దేశించారు మన పెద్దలు వాటికే యోగమని నామకరణం చేశారు వారు. కర్మయోగం, సమాధియోగం, - భక్తియోగం, జ్ఞానయోగం. ఇందులో కర్మసమాధి యోగాలు రెండింటిలో భగవంతుడంటే జీవితానికొక ఆదర్శమనే తప్ప ఒక విశిష్టమైన ఆకారంలో కానరాడు. జ్ఞానయోగంలో జీవుడే ఈశ్వరుడితో తాదాత్మ్యాన్ని భావిస్తాడు కాబట్టి అందులో భగవంతుడనే ప్రశ్నే లేదు. పోతే, సాధకుడైన మానవుడికి భిన్నంగా ఒక భగవంతుడంటూ ఉండి వాడుకూడా తనమాదిరే కరచరణాద్యవయవాలతో దివ్య మంగళ స్వరూపంగా సాక్షాత్కరించేది ఒక్క భక్తియోగంలోనే.

కనుకనే మిగతా అన్ని మార్గాలకంటేకూడా భక్తిమార్గమే భగవంతుణ్ణి చేరటానికి చాలా సులువయింది మానవుడికి. భక్తిఅంటే భజించటం - సేవించటం - లేదా ఆశ్రయించటమని అర్థం. సగుణమైన ఒక ఆలంబనమున్నప్పుడే అది పొసగుతుంది మానవుడు తన ఆరాధ్య దేవతకు సన్నిహితమయ్యేది కూడా అప్పుడే. ఈ సన్నిహితత్వంలోకూడా మరలా తరతమ భావమెంతో ఉంటుంది. భగవంతుడికి భక్తుడెలాగైనా సన్నిహితుడు కావచ్చు. ఒక దాసుడుగా కావచ్చు. మిత్రుడుగా కావచ్చు. ఆచార్యుడుగా కావచ్చు. మాతాపితృ రూపంగానూకావచ్చు. కానీ అన్నిటికన్నా అతి సన్నిహితమైనది స్త్రీ పురుష రూపమైన సంబంధం. రామాయణాదులలో మనకు కనిపించేది అదే. సీతారాములకున్న ప్రగాఢమైన అనురాగం దశరథ విశ్వామిత్ర లక్ష్మణ విభీషణాంజనేయాదుల విషయంలో ఉన్నట్టు చూడలేము.

ఇలాంటి భక్తినే మధురభక్తి అన్నారు. మాధుర్యమంటే ఇక్కడ ఆకర్షణ అని భావం. మిగతా సంబంధాలలో దేనిలోనూ లేని ఆకర్షణ ఇందులో ఎలా చోటుచేసుకోగలిగింది. కారణం అందులో సహజంగా

ఉన్న రసపారవశ్యమే. స్త్రీ పురుష సంబంధంలో ఉన్నంత ఆకర్షణ మరే సంబంధంలోనూ లేదు మానవులకు, ఇది సృష్టిలోనే దాగిఉన్న రహస్యం. సృష్టిఅంతా ప్రకృతి పురుషుల లీలా విశేషమేగదా! అదే మరలా జీవేశ్వర సంబంధంలోనూ ప్రతిఫలించింది. గీతలో చెప్పినట్టు 'ప్రకృతిమ్ విద్ధిమే పరామ్ జీవ భూతామ్' సజీవుడుకూడా ప్రకృతి క్రిందికే వస్తాడు. కనుక స్త్రీ పురుష రూపమైన సంబంధ మొక్కటే విశ్వజనీనమైన అనాది సిద్ధమైన సంబంధం. ఇదే కేవలం భౌతికమైతే శృంగారం. అభౌతికమైతే మాధుర్యం. భక్తి అనేది శృంగారాన్ని మధురంగా మార్చే ఒక పరుసవేది.

ఇలాంటి మధుర భక్తి సంప్రదాయమన్నమయ్యది. అందులోకూడా ఒక చమత్కారమున్నది. భగవంతుణ్ణి పురుషుడుగా భావించి తాను స్త్రీగా ఆయనను భజించటం ఒక ప్రక్రియ అయితే - ఆయననే స్త్రీ అనుకొని తాను పురుషుడుగా ఆరాధించటం మరొక ప్రక్రియ. ఇందులో సూఫీలు మొదలైన తాత్త్వికులది రెండవ మార్గం. వారు తమ ఆరాధ్య దైవాన్ని స్త్రీగా భావిస్తారు. "లైలామజ్నూన్ - షీరినో ఫర్హాద్ - యూసఫో జులైఖా" లాంటి శృంగార కావ్యాలన్నీ ఈ పక్కిలో నడచినవే. లైలా అంటే అసలు రాత్రి అని అర్థం. రాత్రి అనేది అగమ్యగోచరమైన పరమాత్మ తత్త్వానికి ప్రతీక. 'యానిశా సర్వభూతానామ్' అనే గీతా శ్లోకంలో నిశా శబ్దానికలాగే వ్యాఖ్యానం చేశారు భగవత్పాదులు. కాబట్టి పరమాత్మనే నాయికగా కల్పించినట్టు బోధపడుతుందికావ్యంలో. మరి నాయకుడెవడు? మజ్నూన్, జునూన్ అంటే ఉన్మాదం. ఉన్మాదం పరాకాష్ఠ చెందినవాడు మజ్నూన్. అంటే ఏమన్న మాట. పరమార్థాన్ని అన్వేషించటంలో ఉన్మత్తుడైన మహాభక్తుడే నాయకుడు. ఇది భౌతికమూ - అభౌతికమూ అని రెండు విధాలీ ఉన్మాదం. ఇష్కె మిజాజీ - ఇష్కె హకీకీ అని వారు చేసిన విభాగం. ఇష్కె హకీకీ (Love spiritual) అనేదే కవి వివక్షితం. దానికోసం అల్లిన అల్లికమే ఇష్కె (Love physical) మిజాజీ. అది బింబమైతే ఇది ప్రతిబింబం. అది వెలుగైతే ఇది దాని నీడ. ఈ నీడ ఆ వెలుగును పట్టి ఇవ్వటానికే ఉంది తమసోమా జ్యోతిర్గమయ.' ఇదే సూఫీల కావ్య నిర్మాణ రహస్యం. తత్ప్రతి ఫలితమైన వారి భక్తిరసలోలుపత్వం.

సరిగ్గా దీనికి భిన్నంగా నడుస్తుంది మన అన్నమయ్య ప్రభృతుల భక్తి శృంగారం. వారు పరమాత్మను స్త్రీగా భావిస్తే మనవారు పురుషుడుగానే దర్శించారు, మామూలు పురుషుడుకూడా కాదు. పురుషోత్తముడు. పూర్ణత్వమున్న వాడెవడో వాడు పురుషుడు. సర్వ విధాలా పూర్ణమైన తత్త్వం పరమాత్మే గదా. పోతే అలాంటి పూర్ణత్వానికి సహజంగా నోచుకోలేక దాని నందుకోటానికి యత్నించేవాడే జీవుడు. కనుకనే తన్ను స్త్రీగా భావించవలసి వచ్చింది సాధకుడు. అంతేకాదు. తాను పురుషుడని భావించటంలో ఉత్కర్ష భావముంది. వినయంతో తన సర్వస్వాన్నీ తన దైవానికి అర్పించుకొనే తన్మయీ భావం లేదు దానిలో. అలా కాక తాను స్త్రీననుకోటంలో వినయమూ - ప్రపత్తీ - తాదాత్మ్యమూ - తృప్తీ - అనే భావాలు మిన్నుముట్టి ఉంటాయి. అందుకేనేమో ఇలాంటి భక్తి మాధుర్యాన్ని బ్రహ్మాండంగా లోకానికి ప్రపంచించి చూపింది భాగవత పురాణం. భాగవతమంటే అది కృష్ణచరితం. దానికి సకందాయమైన పట్టు దశమస్కంధం. అందులో సారభూతమైనది గోపికా, కృష్ణుల అన్యోన్యానురాగం. 'గోపాయితి మిచ్ఛతీతి గోపికా' దాచుకొనే స్వభావమున్నదే గోపిక. జీవుడని అర్థం. పోతే శరీరేంద్రియ ప్రాణ పుత్త్రమిత్ర కళత్ర

క్షేత్రా రామాద్యభిమానంతో సతమత మవుతున్న జీవులను ఆ కుటుంబ జంబాలంలో నుంచి పైకి లాగే కరుణాశీలు డెవడో వాడు కృష్ణుడు 'కర్షతీతి కృష్ణః'.

ఈ భాగవతం ఆరంభించిన ఈ మధుర భక్తిమయ మహాయజ్ఞమే తరువాత వైష్ణవాళువార్ల కంద రికీ దీక్షను ప్రసాదించింది దాని ఫలమే నాలాయిరం – తిరుప్పావైలాంటి రసపత్థండాలన్నీ. ఇవే చివ రకు మన అన్నమయ్యకు కూడ ఎక్కడలేని ప్రబోధనమూ కలిగించాయి జీవితంలో. దానితో ఆయన పర వశుడై పాడిన భక్తిగీతాలే ఆయనగారి ముప్పదిరెండువేల సంకీర్తనలూ. ఇవన్నీ వేంకటేశ్వరుడికే అంకిత మిచ్చినట్టు కనిపించినా అది పైకిమాత్రమే. అసలు ఆ మహాభక్తుడి మనసులో ఉన్న వేంకటేశ్వరుడు భక్తి రసార్ణవకర్ణ ధారుడైన శ్రీకృష్ణుడే వేంకటేశుడన్నా, విట్ఠలయ్య అన్నా, చొక్కనాధుడన్నా అహోబిల నారసింహుడన్నా – అందరూ కృష్ణుడే అన్నమయ్యకు. అందరిలోనూ చూస్తూ వచ్చిందా కృష్ణతత్త్వాన్నే ఆయన. లేకుంటే శ్రీ వేంకటాద్రి మీది 'చిన్ని కృష్ణుడా' అని చేసే సంబోధనలో అర్థమేముంది.

మరొక చమత్కారమేమంటే అన్నమయ్యకు వేంకటేశుడు కృష్ణుడయినట్టే అలమేలు మంగ తదారాధిక అయిన రాధిక. ఆ రాధిక మరలా ఎవరో గాదు. తానే. అంటే ఏమన్న మాట. అన్నమయ్య కీర్తించే పరతత్త్వం వేంకటేశుడయితే తానా వేంకటేశుడి అర్ధాంగి అయిన అలమేలు మంగ. ఇది ఆ మహా భక్తుడెలాంటి తెరమరుగు లేకుండా స్వయంగానే చెప్పుకొన్నాడొకచోట. ఈ కీర్తన చూడండి.

'నన్ను మీరఁడాతఁడు-నమ్మి సదా సనేను.
పన్నిన మాయలకేమీ ఁబదరకువే.
అరయ శ్రీవేంకటేశుఁడలమేలుమంగ నేను.
గారవించి నన్నుగూడెకై కొనవే–'

ఇవి చెలికత్తెతో అలమేలు మంగ చెప్పిన పలుకులుగావు. అన్నమయ్య తన ఆరాధ్య దైవాన్ని మనసార నమ్మి ఆయన జీవితంలో తన్ను ఎన్ని మాయలకు లోనుచేసినా చివరకు తన్ను ఆదరించి కూడి నందుకే సంతోషించి తన ధన్యతను లోకానికి చాటే సంకీర్తన.

ఒక భాగవతుడిలా తన్నొక నాయికగా భావించి తన ప్రాణనాయకుడుగా ఈశ్వరుని భావించి సేవించటంలో అనేక మర్మములిమిడి ఉన్నాయి. స్త్రీ కున్న పరాధీన బుద్ధి పురుషుడికిలేదు. ఆ అధీనత వినమ్రతనిస్తుంది అది పరిచర్యకు దారితీస్తుంది. అది క్రమంగా దగ్గరచేరుస్తుంది. ఆ సామీప్యం చనవుగా మారుతుంది. అది చివరకు తన్మయీ భావన యోగ్యతను ప్రసాదిస్తుంది. అది ఇక భాగవత జీవితానికే పరాకాష్ఠ. పరమసిద్ధి-ఇలాంటి భక్తి సాధన భూమికలన్నీ భాగవతుడు తనయెడల స్త్రీ భావాన్ని ఆపాదించుకో టంలో సమకూడే ప్రయోజనాలు. ఇంతేగాక తన ఆరాధ్య దేవత తనకు దూరమైనపుడెల్లా ఒక నిరాశా నిస్పృహా-దైన్యం – నిష్ఠురం-బింకం-చనవు కొద్దీ సాధించటం-అంతలోకి అనుతాపమూ-ఆదరమూ- అభి మానమూ- చివరకది ఒనగూడితే ఎక్కడలేని సంతృప్తి-ఇలాంటి మార్మికమైన సంవేదన (Feelings and

Sentiments) లెన్నో ఈ మార్గంలో మనకు సాక్షాత్కరిస్తాయి. ఇవన్నీ భాగవతుని భక్తి మాధుర్యాన్ని శతగుణంగా విస్తరించి చూపుతాయి మనకు సహస్రగుణంగా నూత్న వినూత్నరుచులనందిస్తాయి.

అన్నమయ్య తానే ఒక అలమేలు మంగగా, రాధికగా నాయికగా, ఎప్పుడు భావించాడో అప్పుడివన్నీ మనకాయన వేషభాషలలో బయట పడక తప్పదు. ఇంతెందుకు. అన్నివేల శృంగార కీర్తనలలో ఏకీర్తన అయినా తడవి చూడండి. ఎందులోనూ అన్నమయ్య కనిపించడు మనకు. కనీసం మిగతా వాగ్గేయకారుల రచనలలో మాదిరి చివరి చరణంలో కూడా ఆమాకీ ఇవ్వడు తన ఊరు పేరు మనకు. ఎప్పుడూ ఒక నాయికా భూమికలోనే మనకు సాక్షాత్కరిస్తాడు. అందులోనూ ఈ పై చెప్పిన భావాలలోనే ఏదో ఒక భావం ఒక మహానర్తకి లాగా అభినయించి చూపుతూనే ఉంటాడు.

కోకలేల తీసితివి గోవిందుడా-నీకుఁ
గోకో ఇదివో మొక్కు గోవిందుడా—
కొప్పు దాకించకువోయి గోవిందుఁడా-మా
కుప్పె సవరము పీడ గోవిందుఁడా—

ఈ కీర్తన చూడండి. ఇందులో అన్నమయ్య ఒక గోపిక వేషంలో ప్రవేశిస్తున్నాడు. ఒంటిగా స్నానం చేస్తుంటే నాచీర ఎందుకు దొంగిలించావు. పోనీ అడిగితే ఇవ్వకూడదా? అదీ లేకుండా నాకు నీ కొప్పు దాకిస్తా మేమిటి అన్యాయం. చూడు దాని మూలంగా నా సవరం జారి క్రింద పడిందని నిష్ఠుర మాడుతాడు. ఇది పైకి నిష్ఠురం. లోపల ఇష్టమే. అది లేకుంటే కోకలు తీసినందుకు మొక్కటం దేనికి. కొప్పు దాకించినందుకు కుప్పెసవరం పీడిందని చెప్పటం దేనికి? తీసింది-తాకించినది ఎవరో గాదుగా- తన ప్రాణనాధుడే, అంచేత అది ఆయన తీయావచ్చు. ఇది తనకు పీడావచ్చు. చూడండి ఈ మార్మికమైన భావరేఖ.

నీరు వట్టు గొన్న వేళనేయి మందవునా
కూరిమి మమ్మిద్దరిని గూరుచరే చెలులు—

ఇది నాయకుడు తనకు దూరమైనపుడాయనసాంగత్యాన్ని కోరుతూ దైన్యంతో చెలికత్తెలను బ్రతిమాలుతూ ఉన్న నాయికా వచనం దాహమైతే నీరు తాగుతారు గాని నేయి తాగరెవరూ. నేయి విలువ లేనిదని కాదు. అది దానికుపశమనం కాదని మాత్రమే. అలాగే నాయకుని సాధించటం కాదు సరియైన కార్యం. అది వియోగ వేదననింకా ఉద్దీపితం చేస్తుంది. కనుక నాయకుని పొందే ఇప్పట్లో వాంఛనీయమని దైన్యాన్ని వెలిబుచ్చుతుంది ఇక్కడ నాయిక.

చేయి ముట్టి సరసాలు చెల్లవు నేఁడు
ఆయనాయనిక నేల ఆటువంటి పనులు
బలిమి సేయకురా పవళించి ఉన్నదాన
అలరి నీవు నాకు లోనౌటే చాలు.

చూడండి. ఇందులో నాయిక ఎంత బింకంగా మాటాడుతూ తన్ను బలవంతంచేసే నాయకుణ్ణి ఎంత విసరి కొడుతున్నదో. అలా భీష్మించుకుని పరాన్ముఖి అయికూడా ఏమంటున్నదో చూడండి. అలరి నీవు నాకు లోనౌదే చాలునట.

ఏమని చెప్పనే యిట్టి నావలపు
ఆ మీదటి పనులతడే యెఱుగు
పెదవుల నున్నది పేరాతనిదే
కొద దీఅవు నాకోరికలు.

నాయిక మనసులో ఎంత గాఢమైన వాంఛ దాగిఉన్నదో ఈపాట బయటపెడుతున్నది. వలపే తనదట. పనులాయనవట. అచంచలమైన భక్తిభావముండాలేగాని ఆపై అనుగ్రహమంతా భగవానుడిదేననే భావం కూడా ఇందులో ఎంతగానో తొంగి చూస్తున్నది.

వాసికి బ్రతుకుదే పనితలైనవారు
పాసిన కూటికంటే పస్తైనా మేలురా
యెందుకు బోసప్పుడుదా యెనసేది మనసు
అక్కడి పరాకు మానినప్పుడుగా నీవు
వున్నాదవు మాయింట వూహలు నీకెట్టివో
యిందరిగూడి శ్రీ వేంకటేశ నన్నూ గూడితివి.

ఇలాంటి చరణాలలో నాయకుడి చేష్టలకు నాయిక ఎంతగా నిర్వేదం నిస్పృహా చెందుతుందో కొట్టవచ్చినట్టు కనిపిస్తుంది. అనన్యదృష్టి జీవుడికేగాదు- దేవుడికీ ఉండాలని తేటపడుతున్న ఒక రహస్య భావమిది.

మాటలివి మంచివేపో-మనసే తెలియఁగాని
ఆటదాన పుణ్యపాపమది నీదేపో-
చల్లని వెన్నెలనవ్వు చల్లితివి నేడు నీవు
మొల్లమిగానంతనేము మోపఁగలమా-

ఈకీర్తన చూడండి. తన అమాయకత్వమూ-నిష్కల్మషతా-వినమ్రభావమూ-ఎలా ప్రదర్శిస్తూఉందో నాయిక. 'మనసే తెలియఁగాని' అనటంలో భగవత్తత్త్వం- దాని ప్రణాళికా మనకంత పట్టదనీ- 'నవ్వుచల్లితివి-అంత మోపగలమా' అనటంలో ఒకవేళ దేవుడను గ్రహించినా జీవుడు దానికి పొంగిపోకుండా జీర్ణించుకోగలడా అనీ ఎంతో గంభీరమైన భక్తి రహస్య మాధుర్యం కూడా సూచితమవుతూ ఉంది.

అనకేమున్నది-అలుగనేమున్నది
కనుగొనలనే చూచి కరగుట గాక!

చూడండి ఈచరణం. ఉన్నట్టుండి అన్ని నిష్ఠూరాలకూ- అన్ని అవమానాలకూ - అన్ని బింకాలకూ స్వస్తి చెప్పి ఆయన సాంగత్యంలోనే కరగిపోతానంటుంది నాయిక. చూస్తే ఇది నాయిక తరగటంకాదు. పరమాత్మ సాక్షాత్కరించాలేగాని ఇక మాటలేదు. పలుకులేదు. 'భిద్యతే హృదయగ్రంధి' అన్నట్టు అన్ని లౌకిక వాసనలూ నశించి అలౌకికమైన సుఖానుభూతికి నోచుకొనే సాధకుడి తన్మయావస్థకే చేస్తున్న వ్యాఖ్యాన మనిపిస్తుంది.

ఇలా ఎన్ని భావాలని ఎన్ని భంగిమలని- ఎన్ని రహస్యానుభూతులని - ఎన్ని మధురిమలని తడవి తీసేకొద్దీ ఒక అక్షయ రత్నాకరంలాగా బయటపడుతూనే ఉంటాయి రత్నాలూ, వజ్రాలూ వరిహాల లాంటి మధుర శృంగారభావాలెన్నో- అవన్నీ మరెవరోగాదు. భాగవత శిరోమణి అయిన అన్నమయ్య పొందిన వివిధ భక్తిభూమికలే. ప్రదర్శిస్తున్న చిత్రవిచిత్ర భంగిమలే. "ఎంతమీదు కట్టెనో ఇంతి నీదు జవ్వనము" అని ఒకచోట ఆయన చెలికత్తె వేషంధరించి నాయకుడైన వేంకటేశునికి సిఫారసు చేస్తాడు. "ఎఱుగడుగాక తన్ను నిందలాడుకొనేది-తటిలో నామాటగానే తలంచుకొమ్మనవే" అని ఒకచోట తన దశనే తాను చెలికత్తెద్వారా నాయకునికి మొఱపెట్టుకొంటాడు. "మానుమన్నా మానఁడు మాటిమాటికి- పోసిమ్మని వూరకున్నా బొదవెక్కీఁదవే" అని నాయకుణ్ణిగూర్చిన నిష్ఠురోక్తులు చెలికత్తెతో చెప్పుకొని వాపోతాడు మరొకచోట "నడుమంటాఁబట్టితివి నాఁడే బట్టబయలాయవడినందువేల పోకముడివేసేవే" అని నాయకుడి భూమిక ధరించి తనలో తానే చమరులాడుతూ చనువుగా మాటాడుతుంటాడు. పోతే ఇక "చెల్లుబడిగద్దంటా జేసేవుగాని వొల్లమన్నా బోరుసుమ్మీవుద్దండమైనాను-ఏమీ నెఱుఁగని సతినింతయేతురా- కోమలపు మనసులు కొలఁది నిలుచునా" అని ఇలా స్వయంగా తానే తన నాయకుడితో ముఖాముఖి నిలుచొని వాదులాడుతాడు.

ఏపంవిధ విశేషణ విశిష్టమైన భక్తి అన్నమాచార్యులది అది విశ్వతోముఖం-విశ్వజనీనం. మధుర రసావిష్టం మంజులభావ శోభితం - మాటిమాటికీ చర్వణయోగ్యం. మానవుల హృదయాంతరాళాలలో లోలోపల దాగివున్న అనంతానంత కఠిన కోమల భావరేఖలనన్నిటినీ తట్టి మేలుకొలిపి వాటినన్నిటినీ ఇంత వన్నె చిన్నెలలో రేఖాచిత్రాలుగా మలచి-ప్రపంచాభిముఖంగా కాక పరమాత్మకభిముఖంగా ప్రసరింపఁజేసిన మధురభక్తి రసాయన నిర్మాణ విశారదుడన్నమయ్య నిజంగా ధన్యుడు. ఆ రసాయన మాధుర్యాన్ని ఆయన అసంఖ్యాక కీర్తనల ద్వారా అందుకొని అనిత్యమైన సంసార వాసనల మరచి నిత్యసత్యమైన పరమార్థ సుఖాన్ని ఆస్వాదించే మనం కూడా ధన్యజీవులమే-

శ్లో॥ మాధుర్యభావభక్తేన వచశ్శతేన-యో వేంకటాచలపతే ర్హృదయమ్ జహార
తమ్ క్షీరసాగరసుతా ధృత నూత్న వేషమ్-వందామహే తిరుమలాన్వయదేశికేంద్రమ్॥

# 'వెండితెర' మీద అన్నమయ్య!....

— శ్రీమతి డి. సీతాపద్మరాజు

అవి నవంబర్ నెలలోని శీతాకాలపు చలిరోజులు. ఆ ఏడుకొండల వెంకన్నని కాలినడకన కొండెక్కి దర్శించుకోవాలన్న తలంపు అనుకోకుండా మనస్సులో ఉదయించింది. వయస్సు పైపడుతున్నా అనారోగ్యాన్ని, శరీరభారాన్నికూడా లెక్కచేయకుండా తిరుపతి కొండ ఎక్కడం మొదలుపెట్టాం. సాయంత్రం బయలుదేరిన మా కాలినడకయాత్ర చీకటిని చీల్చుకుంటూ ఒంటరితనాన్ని, అడవి భయాలకి అతీతంగా గుండెలలో మారుమ్రోగుతున్న శోభారాజు గానంచేసే అన్నమయ్యపదాల ప్రతిధ్వనులతో ఏవో ఏవేవో ఆలోచనా పోరుతో ముందుకు సాగిపోతోంది. ఆ భావనా ప్రపంచంనుండి తేరుకుని స్నానం ముగించుకుని స్వామి దర్శనం చేసుకుని మా స్పెషల్ కాటేజి ముందున్న ఉద్యానవనంలో సేదదీర్చుకొంటూ వుంటే మళ్ళీ దూరంగా లౌడ్‌స్పీకర్లలో శోభారాజు బృందం అందించిన 'అన్నమయ్య కథ' వినిపించసాగింది. కళ్ళు మూసుకుని వినిపిస్తున్న ఆకథకి మనస్సులో రూపకల్పన వూహించుకుంటున్నాను.

అప్పుడు మెదిలింది ఈఆలోచన! మనం ఎందుకు ఈ అన్నమయ్య కథని వెండితెరకి ఎక్కించకూడదు? అని. ప్రక్కనేవున్న మా శాండిల్యగారితో ఆముక్కే అన్నాను. నాతోపాటు ఆయన ఆ పాటలని వినడం, సహజంగా నాకంటే కవిగా, రచయితగా, భావుకుడిగా అనుభవం కలిగిన శాండిల్యగారు నాఆలోచనని సమ్మతించడం కేవలం ఆస్వామి సంకల్పంకాక మరేమిటి?

మేము 'ఆనందభైరవి'లాంటి ఒక మంచి కళాఖండాన్ని ఆంధ్రదేశానికి అందించిన నాటి నుండి ఎక్కడికి వెళ్ళినా ఎవరు కనిపించినా వేసే ముఖ్యమైన ప్రశ్న 'ఆనందభైరవి' తరువాత మీ తదుపరి చిత్రం ఏమిటి? అని. అప్పటికి ఏ నిర్ణయం కానందున సమాధానం తడుముకోవల్సి వచ్చేది కానీ ఎప్పుడైతే మా ఆలోచనని మా దర్శకులు శ్రీ జంధ్యాలగారు ఆమోదించారో ఆనాటినుంచి మాఉత్సాహానికి అవధులు లేవనే చెప్పాలి! నేను అంతకుముందు రెండు మూడుసార్లు శ్రీమతి శోభారాజుగారు అన్నమయ్య సంకీర్తనలని గానం చేస్తుంటే విన్నాను. ఆవిడ గొంతులో మాధుర్యంద్వారా అన్నమయ్య పదాలలోని భావపటిమ మధురాతి మధురంగా హృదయాంతరాళంలో స్థిరపడిపోయింది. అంత అద్భుతంగా ప్రేక్షకులని అన్నమయ్య పదాల ద్వారా సమ్మోహితుల్ని చేస్తున్న శోభగారినే మన చిత్రకథకి కావలసిన బీజం వెయ్యమని అడగాలనిపించింది. మాఆలోచనని ఆవిడకి తెలియచేయగానే అన్నమయ్యనే జీవనగానంగా, ఆయన భక్తితత్వ ప్రచారంలో ప్రాణంగా నిలిచిన ఆమెలో ఆనందం వెల్లివిరిసింది. ఎన్నేళ్ళుగానో కలలుకంటున్న తన జీవిత లక్ష్యం ఒక దిగ్ దర్శకుడిద్వారా ఆవిష్కరింపబడుతున్నందుకు ఎంతో సంతోషించింది. వెంటనే ఒక పదిరోజులు

శ్రమించి అన్నమయ్యపదాలలోని భావాలకి ఆలంబనగా తాళ్ళపాక చిన్నన్న రాసిన అన్నమయ్య చరిత్ర ఆధారంగా మాకు అన్నమయ్య కథని వివరంగా అందించారు. అది విన్న మా దర్శకులు శ్రీ జంధ్యాల, తెలుగు ప్రేక్షకులు శాశ్వతంగా భద్రపరుచుకునే మరో ఉత్తమచిత్రంగా అన్నమయ్యగాథని వెండితెర కెక్కించగల మన్న విశ్వాసం వ్యక్తపరిచి ఆనాటినుంచి తన సర్వశక్తుల్ని కేంద్రీకరించి ఈ చిత్రాన్ని తీర్చిదిద్దటంలో నిమగ్నులైనారు.

అన్నమయ్య పదాలు ఒక క్షీరసముద్రంలాంటివి. చిలికినకొద్దీ అమృతం వర్షిస్తుంది ఆపదలలోని భావన సామాన్యుడిలో మాధవుని చూడగల తత్వంఉంది! ఆధ్యాత్మిక శక్తితో శృంగార సంకీర్తనలని జోడించి రెండింటినీ ప్రజాభిరుచికి తగ్గట్టుగా మలిచిన తొలి తెలుగు వాగ్గేయకారుడు అన్నమయ్య! 'హరికీర్తనాచార్యుడిగా' 'పదకవితా పితామహుడిగా' వాసికెక్కిన ఈ వేంకటేశ్వర భక్తుడు హరి అవతారమని మనం అంతా నమ్మక తప్పదు! రాజభోగాలని కాదన్నిన త్యాగమూర్తి! హరికీర్తనల ప్రచారమే తన జీవిత ధ్యేయంగా పెట్టుకుని జనబాహుళ్యానికి అర్థంఅయ్యే సరళ శైలిలో వాడుకపదాలలో అతని కీర్తిని రసగుళికలుగా అందించిన అమరమూర్తి అన్నమయ్య!

ఆయన చరిత్రని 'వెండితెర' కెక్కించడం ఒక సాహసం! ఆ సాహసపూరిత కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తిచేయగల శక్తి, సమర్థత మా జంధ్యాలకివుంది. 'ఆనందభైరవి'ని తీర్చిదిద్దిన తీరును పరిశీలించిన తరువాత ఇలాంటి భక్తితత్పరతతో కూడుకొన్న కళాత్మక చిత్రాన్ని అందించగల నేర్పు శక్తి సామర్థ్యాలు ఆయనకే చెందగలవని ఎవరైనా ఒప్పుకొనక తప్పదు! అందుకే ఆయన ఇదొక 'అగ్ని పరీక్ష'గా తీసుకుని తన సర్వశక్తులను వినియోగించి తెలుగు ప్రేక్షకులు చిరకాలం వారి గుండెలలో భద్ర పరుచుకునే మహత్తర కళాఖండంగా తీర్చిదిద్దగలరని ఆశిస్తున్నాను.

ఈ బృహత్తర కార్యక్రమంలో నాతోపాటు అహర్నిశలూ శ్రమించే శాండిల్యగారూ సోదరి శ్రీమతి అన్నపూర్ణా జంధ్యాల కూడా నాకు అండగా నిలవడం నా అదృష్టం! ఆ వాగ్గేయకారుడి అమృతమయమైన పదాలకి జీవం పోయడానికి సంగీతం సమకూరుస్తున్న శ్రీ రమేష్‌నాయుడుగారూ, కన్నులపండుపుగా వెండి తెరమీద భద్రపరుస్తున్న గోపాల్‌రెడ్డి ధన్యులు!

శ్రీమతి శోభారాజ్ అన్నమాచార్య భావనావాహిని పేరిట తలపెట్టిన అన్నమయ్య ప్రచార కార్యక్రమంలో మా శ్రీచరణ చిత్రాలయం ఆనందంగా పాలుపంచుకుంటుంది. ఈ ప్రచారానికి ఈ చిత్రం ఒక అందమైన ప్రతిబింబం కాగలిగి శ్రీ వేంకటేశ్వరుడి మణిమయ కిరీటంలో ఒక కోహినూర్ వజ్రంగా మిగిలి పోవాలని ఆకాంక్షిస్తున్నాను. ఈ మహత్తర కార్యక్రమాన్ని నిర్విఘ్నంగా కొనసాగించే శక్తి మాకూ మా దర్శకుడు జంధ్యాలకి అందించవలసిందిగా ఆ ఏడుకొండల వెంకన్నని వేడుకుంటున్నాను.

# Annamacharya - The Saint Composer

—A. S. MURTHY,
Former Director, Ravindra Bharathi.

In no other literature of the world can, the manifestation of faith in God and reverence to religion, be seen as in the Telugu Literature. Having made its splendid begining at the court of Raja Raja Narendra, it consecrated itself with the noble objectives of devotion to God and service to society. In the galaxy of stars that illuminated the sky of Telugu Literature, the name of Annamacharya shines and shines for ever as the first Saint Composer of everlasting devotional songs.

While Nannayya was the first poet of "Padya Kavita" Annamacharya was the first composer of "Pada Kavita". He has even enriched the Telugu Literature by composing original sons in Telugu and dedicating them to Lord Venkateswara in word and spirit.

The life of Annamacharya is replete with a great message to the world to uphold theism and realise the true objective of life as surrender to God.

The Bhagavadgita asserts that the Lord incarnates Himself in the ages to establish Dharma in the world. He took the form of Narasimha in Krita Yuga; Sree Rama in Treta Yuga; Sree Krishna in Dwapara Yuga and Sree Venkateswara in Kali Yuga, who is no other than the Lord Vishnu, the Almighty. God manifests Himself in sages and saints. They are Apostles of God that kindle the love of God in men. Annamacharya is a Saint Composer that used the powers of literature and arts of music in praise of Lord Venkateswara. He was a born composer having inherited the virtue through his purposeful birth. He was a precursor to the saint musicians like Thyagaraya and Bhadrachala Ramadas and a contemporary to the great Kannada composer Purandardas.

Purandardas was a devotee of Panduranga with a popular following in Karnataka for his musical traditions. He believed Annamacharya to be the incarnation of Lord Venkateswara Himself. Annamacharya's greatest contribution to the musical world is that his "Pada Kavitas' are composed in the local dialect with perfect rhyme and rhythm.

Annamayya, the name of the composer before he became Acharya, was born in 1408 A. D. to Narayana Suri and Lakkamamba in Tallapaka – a village in

Cuddapah District. He inherited literary talent from his father and devotion to the Lord from his mother. He lived for a full life of 95 years and left an indelible mark in the hearts of music lovers.

Annamayya was uncared for as a child and was left to the mercy of his brother and sister-in-law, who used to send him to the fields for cutting the grass. One day it so happened that he cut his finger while cutting the grass. He wept bitterly and realised that there was none to console him, except Lord Venkateswara. Immediately he started on his march to the Seven Hills without looking back. While climbing the steep hills, he fell unconscious and was relieved of his pain by the gracious touch of Alamel Manga. He climbed the Kneeling Mountain, feeling immense joy at the sight of Tirumala and singing spontaneous songs in praise of the Lord.

His songs attracted the crowds at Tirumala, who were astonished at the musical powers of the teen-aged prodigious child. He could write a 'Sataka' before his garments got driedup. By the time he completed the poems and arrived at the Golden gates, the doors were closed. His songs made the gates open at once and the Chief Purohit could realise that the boy was the one recommended by the Lord in a dream for adoption to Vaishnavism.

Henceforward Annamayya became Annamacharya and quickly earned great renown for his compositions on Lord Venkateswara. He married Tirumalamma and Akkalamma. Tirumalamma is no other than Timmakka the first lady writer who is the authoress of "Subhadra Kalyanam".

Annamacharya visited Ahobilam and became a disciple to Satakopayati-the famous Dravida Composer, who conveyed great philosphy through his works and dedicated them to God.

Annamacharya conceived Art to be an instrument, only to be used in praise of God. He spurned riches and declined royal awards. The Vijayanagara emperor, Saluva Narasima Raya who got elevated from the position of a Commander-in-Chief of Tanguturu to that of an emperor of Vijayanagara, with the help of Annamacharya, got enraged at the refusal of Annamacharya to compose songs in praise of the King and for this he imprisoned him. The invincible Annamacharya did never stoop to the royal pressures or pleasures and stood as a symbol of individuality.

Annamacharya's compositions do not reflect literary genius alone. They show a unique philosophy of life with an ardent stress on the need for and utility of surrendering oneself at the feet of Lord Venkateswara. They picturise the universality of God and the neeessity to offer Him all our dedications through service and surrender.

Annamacharya's songs have a wide range of subjects though the undelying current of all the subjects is the same. In the song "Adivo Alladivo", he makes the whole world visualise the exuberance of Tirumala-the abode of Lord Venkateswara the Kaliyuga Vaikunta, where all the sages, seers, and angels are seated.

Behold! Behold! Lo! The abode of Srihari
Behold the highest seat of Venkata Chalapathi
Beset with the hoods of ten thousand serpents divine
Beloved to the Brahma and all the Gods of Heaven.

That is the abode of sages, seers and yogis of the yore
That sing in praise, the marvels of the Lord in lore
That is the holy land for salvation of soul
That is wholly consecrated to be the life's goal.

Adore, Worship, submit and surrender to the feet holy
Avail, enjoy and engross in the inexplicable bliss in ecstacy
Attain the golden tower that none can envy
Above the ephemeral sorrows the world can convey

As you reach the feet of the Lord, you burst out in tears in an inexplicable humility seeking His grace to solve the riddles of your life. Annamacharya prays to the Lord to listen to our wondrous grievances. In the song "Vinnapalu Vinavale', he beseeches the Lord to look at the queue of the devotees which includes the Yakshas, Kinneras and others.

Listen! Listen! O Lord! Listen to our wondrous grievances
Lift! Lift! O Lord! Lift the golden veil before Thy eyes
Look! Look! the Sun has surpassed the eastern horizons
Look! Look! the angels and the sages have surrounded Thy regions.

Listen! Listen! O Lord! The Garudas, the kinneras and
the Yakshas have all joined in line
To sing the hymns in praise-thy stories divine
Look! Look! O Lord! Look at their affectionate and devoted looks
That speak of Thy enormous vision in the sacred books

Listen! Listen! O Lord! Listen to the songs of Adi Sesha,
Narada and Tumbura
Listen! Listen! O Lord! They are repeating Thy name-Venkateswara.
Look! Look! The whole world is seeking Thy grace
Lift! Lift! Lift Thy golden veil and reveal the splendour of Thy face.

Life is a mystery inside an enigma. None knows wherefrom one comes and where one goes finally. The ephemeral attachments make one forget the truth of life that the immortal soul has to leave the mortal cocoon. Even if one knew this, his attachments to the worldy relations are such that the indiviual identifies himself with parents, brothers, sisters, wife and children so deeply that he considers them as the source of joy, while, in fact, they are the source of sorrow. The source of joy is the Almighty only. This is beautifully brought out in Annamacharya's kavita "Ayyo Poyene - Praayam - Kaalam"

Alas! Alas! I have felt alas
That I have lost my youth and relatives
Add that they were the sources of joys
That make my life happily rejoice.

Nay! Nay! I have known at last
That the sons, the daughters, the parents and the partners
All are oniy the seducers of sin
And hurdles in my journey to Lord's Inn.

Only the Lord of Seven Hills
Has the power to absolve me from all ills
Only the Lotus feet of Lord Srinivas
Can offer me the ultimate solace

When the devotee employs himself in the service of Lord, he forgets himself and the outer world. The Lord is his child to nurse. The Lord is his master to serve. He sings even Lulluby to the Lord to have a blissful sleep, as is depicted In Annamacharya's famous composition, 'Jo Atchyutananda'.

Jo! The Divine kid! Jo!
Jo! The Divine kid! Jo

Thou art the feast to the eyes of Nanda
Thou art the host to the joy of Yasoda

Thou art the destroyer of evil Kamsa
Thou art the restorer of Pandava Vamsa.

Thou art the doer of naughty deeds
Thou art the prompter to Gokula kids

Thou art the lover of Mathura maids
Thou art the bestower of Joyous trades.

Jo! The divine kid! Jo!
Jo! The divine kid! Jo!

Yet another important masterpiece is the song on the divinity of the feet of the Lord, ever washed by the Gods. In the song, "Brahma Kadigina Paadamu" Annamacharya highlights the concept of Bhakti cult that wins the Lord's heart through surrender to His feet.

Thy feet are ever washed and worshipped by the Brahma
Thy feet are the terminus in the travel of Atma
Thy feet are the omnipotent Brahma Itself
Thy feet are the omnipresent Almighty Himself.

Thy feet are that measured the worlds
Thy feet are that stretched the heavens
Thy feet are that lowered the malevolent Bali to the infernal doom
Thy feet are that raised Ahalya to beautiful boom.

Thy feet are served by Lakshmi with love and affection
And that the sages seek refuge with devotion
Thy feet are that enlighten us with the Truth
That Lord Venkateswara is the only Truth.

God appears Himself in saintly lives. The musical heritage of Andhra Pradesh is rich with outstanding works of divine composers like Annamacharya, Kshetrayya Bhadrachala Ramadas and Tyagaraya. Despite the short spell of mortal life, Annamacharya spiritually lives in the minds of devotees and music lovers. as long as the Lord of Seven Hills showers His blessings on the mankind.